



www.aksharamtelugudaily.com

# సుఫల అక్షరం

సామాన్యుడి అస్త్రం తెలుగు దినపత్రిక

మంగళవారం 2 జనవరి 2024 ఎడిటర్ : షేక్ యాకూబ్ పాషా

పేజీలు : 12 సంపుటి : 06 సంచిక : 287 వెల : రూ.3/- కొత్తగూడెం తెలంగాణ

CIRCULATED BY : ADILABAB,, ASIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULABMA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOODNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRICILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI

## సోరెన్ భార్యకు సీఎం పగ్గాలు..



## 2024 సంవత్సరం గగన్‌యాన్‌దే




### ఇస్రో చైర్మన్ సోమనాథ్

హైదరాబాద్, జనవరి 1 (అక్షరం న్యూస్)
2024 సంవత్సరం తొలిరోజునే భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ ఎక్స్‌పోశాట్‌ను విజయవంతంగా ప్రయోగించింది. ఇదే ఉత్సాహంతో ఈ ఏడాది మరికొన్ని మిషన్లను చేపట్టనున్నది. ఇందులో కీలకమైన గగన్‌యాన్ మిషన్ సైతం ఉన్నది. గగన్‌యాన్‌తో పాటు ఈ ఏడాది 12 నుంచి మిషన్లను చేపట్టాలని ఇస్రో లక్ష్యంగా పెట్టుకుందని ఇస్రో చైర్మన్ ఎస్ సోమనాథ్ తెలిపారు. 2024 గగన్‌యాన్ మిషన్‌కు సన్నాహక సంవత్సరమని తెలిపారు. గగన్‌యాన్ మిషన్‌లో భాగంగా ఇస్రో 2023లో అబార్ట్ మిషన్ నిర్వహించింది. ఈ ఏడాది మరో రెండు అబార్ట్ మిషన్లను నిర్వహించనున్నట్లు సోమనాథ్ ప్రకటించారు. రెండు మానవరహిత మిషన్లు.. హెలికాప్టర్ డ్రాప్ టెస్ట్, లాంచ్ ప్యాడ్ అబార్ట్ టెస్ట్ చేపట్టనున్నట్లు వెల్లడించారు. వీటితో పాటు పలు వాల్యుయేషన్ పరీక్షలు సైతం నిర్వహించనున్నట్లు తెలిపారు.

నింగిలోకి జీఎస్ఎల్‌వీ..
ఈ ఏడాది జీఎస్ఎల్‌వీని సైతం ప్రయోగించనున్నట్లు ఇస్రో చైర్మన్ తెలిపారు. ఇన్‌శాట్–3డీఎస్, భారత యుఎస్ సంయుక్తంగా నిర్మించిన నిసార్, సెకండ్ జనరేషన్ నావిగేషన్ ఉపగ్రహాలను జీఎస్ఎల్‌వీ నింగిలోకి మోసుకెళ్లనుందని చెప్పారు. రెండు వాణిజ్య ఉపగ్రహాలను, పీఎస్ఎల్వీ రాకెట్‌తో పలు రిమోట్ సెన్సింగ్ ఉపగ్రహాలు, ఓ ఎస్ఎస్ఎల్వీ ప్రయోగం సైతం ఉంటాయని వివరించారు. స్క్రామ్ జెట్ ఇంజిన్ పరీక్ష, రీయూజబుల్ లాంచ్ వెహికల్ టెస్ట్‌లను సైతం 2024లో నిర్వహిస్తామన్నారు. ఈ ఏడాది కనీసం 12 మిషన్లను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. హార్డ్‌వేర్ లభ్యతను బట్టి ఈ సంఖ్య పెరిగే అవకాశం ఉందని తెలిపారు. ఈ సందర్భంగా ఎక్స్‌పోశాట్‌పై సైతం సోమనాథ్ స్పందించారు. ఇది ఓ ప్రత్యేక మిషన్ అని పేర్కొన్నారు. దీంతో కృష్ణ బిలాలపై మరింత అధ్యయనం చేయనున్నట్లు తెలిపారు. ఒక గతేడాది ప్రయోగించి ఆదిత్య ఎల్–1 జనవరి 6న ఎల్–1 పాయింట్‌కు చేరుకుంటుందని వివరించారు.

## నా వద్ద చెప్పేది ఒకటి.. చేసేది మరొకటి ఉండదు..

### మెట్రో, ఫార్మా సిటీని రద్దు చేయట్లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి

హైదరాబాద్, జనవరి 1 (అక్షరం న్యూస్)

మెట్రో, ఫార్మా సిటీని రద్దు చేయట్లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని స్ట్రీమ్ లైన్ చేస్తున్నామన్నారు. శంషాబాద్ విమానాశ్రయానికి వెళ్లే మెట్రో దూరం తగ్గిస్తామని స్పష్టం చేశారు. బీహెచ్‌ఈఎల్ నుంచి విమానాశ్రయానికి 32 కి.మీ దూరం ఉంటుందన్నారు. కొత్త సంవత్సరం సందర్భంగా నేడు సచివాలయంలో మీడియాతో చిట్ ఛాట్ చేస్తూ, ఎంజీబీఎస్ నుంచి పాతబస్తీ మీదుగా విమానాశ్రయానికి మెట్రో మార్గం ఏర్పాటు చేయనున్నట్లు సీఎం పేర్కొన్నారు. నాగోల్ నుంచి ఎల్బీ నగర్, చాంద్రాయణ గుట్ట వద్ద విమానాశ్రయానికి వెళ్లే మెట్రో లైన్‌కి లింక్ చేయనున్నట్లు చెప్పారు.

అవసరమైతే మియాపూర్ నుంచి రామచంద్రాపురం, మైండ్ స్పేస్ వరకు ఉన్న మెట్రోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వరకు పొడిగిస్తాం. మేము కొత్తగా ప్రతిపాదించబోతున్న మెట్రో కారిడార్లు గత ప్రభుత్వం ప్రతిపాదించిన ఖర్చుతో పోలిస్తే తక్కువ ఖర్చుతోనే పూర్తవుతాయి" అని సీఎం వివరించారు. "ఫార్మాసిటీ, రింగ్ రోడ్, రీజినల్ రింగ్ రోడ్

మిగతా 2లో..




## తెలంగాణలో నక్సలిజం కనుమరుగు

- -తగ్గిపోయిన కొత్త రిక్రూట్‌మెంట్లు
- -రాష్ట్ర క్యాడర్ అంతా ఛత్తీస్‌గఢ్‌లో మకాం
- -ఇప్పుడు అక్కడే తీవ్రవాదం అధికం
- -ఆ తర్వాత స్థానంలో మహారాష్ట్ర
- -తాజా నివేదికలో ఎన్సీఆర్బీ వెల్లడి



• 2లో

## ఏపీసీసీ బాధ్యతలు షర్మిలకు!



నో చెప్తే స్టార్ క్యాంపెయినర్‌గా
కడప నుంచి ఎంపీగా పోటీకి..
లేదా కర్ణాటక నుంచి రాజ్యసభకు?
ఏపీ రాజకీయాలపై కాంగ్రెస్ దృష్టి
2029 ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రొజెక్ట్
రంగంలోకి మాణిక్కమ్ ఠాగూర్
షర్మిల చేరిక ఇక లాంఛనమే


హైదరాబాద్, జనవరి 1 (అక్షరం న్యూస్)
వైఎస్ షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరిక దాదాపు ఖాయమైంది. ఆమె చేరిక కేవలం లాంఛనమే. ఈ వారంలోనే ఆమె కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోబోతున్నట్టు కాంగ్రెస్ వర్గాల విశ్వసనీయ సమాచారం. ఆమెకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పార్టీ పగ్గాలు అప్పగించాలని కాంగ్రెస్ పెద్దలు నిర్ణయించినట్టు తెలుస్తున్నది. ఈ మేరకు షర్మిల భర్త అనిల్‌కుమార్‌తో ఇప్పటికే ఢిల్లీలో కాంగ్రెస్ పెద్దలు చర్చించినట్టు సమాచారం. ఫైనల్‌గా షర్మిలతో కూడా ఈ విషయం మరోసారి చర్చించాక ఏఐసీసీ అధికారికంగా ప్రకటిస్తుందని సమాచారం. కర్ణాటక, తెలంగాణలో సాధించిన విజయాల స్ఫూర్తితో ఏపీలోనూ పార్టీని బలోపేతం చేసే దిశగా కాంగ్రెస్ వ్యూహరచన చేస్తున్నదని, ఇందులో భాగంగానే షర్మిలకు పార్టీ బాధ్యతలు అప్పగించేందుకు పార్టీ పెద్దలు పావులు కదుపుతున్నట్టు తెలుస్తున్నది. ఏపీ కాంగ్రెస్ కమిటీ పగ్గాలు చేపట్టడానికి షర్మిల ఇప్పడే అంగీకరించని పక్షంలో తొలుత పార్టీ స్టార్ క్యాంపెయినర్‌గా నియమించి, ఆ తర్వాత పార్టీ పగ్గాలు అప్పగించాలన్నది పార్టీ వ్యూహమని చెప్తున్నారు.

ఆంధ్రలో పూర్వవైభవమే టార్గెట్
ఇప్పటికే ఏపీకి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులను కాంగ్రెస్ అధిష్ఠానం పెద్దలు ఢిల్లీకి పిలిపించుకొని షర్మిల చేరిక, పార్టీ బాధ్యతల అప్పగింత, సార్వత్రిక ఎన్నికలపై విస్తృతంగా చర్చించారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, అగ్రనేత రాహుల్‌గాంధీ, జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తమతో షర్మిల చేరికపై చర్చించిన విషయాన్ని ఏపీపీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, కేంద్ర మాజీ మంత్రులు పల్లంరాజు, జేడీ శీలం మీడియాకు వెల్లడించారు. పార్టీని బలోపేతం చేయడానికి కాంగ్రెస్ సీనియర్లను కూడా ఘర్‌వాపసీ నినాదంతో తిరిగి పార్టీలోకి తీసుకరాబోతున్నట్టు రుద్రరాజు తెలిపారు. ఉమ్మడి

మిగతా 2లో..

## బియ్యం@ 6,200

భారీగా పెరిగిన బియ్యం ధరలు
రికార్డు స్థాయిలో క్వింటాలుకు రూ.1500 పెరుగుదల
మార్కెట్లో తగ్గిన బియ్యం లభ్యత
ఈ యాసంగిలోనూ వరిసాగు తగ్గే అవకాశం



• 2లో

## నూతన సందడి

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు
ఆలయాలకు పోటెత్తిన భక్తజనం
ఇండ్ల ముంగింట రంగవల్లులు


హైదరాబాద్, జనవరి 1 (అక్షరం న్యూస్)
నూతన సంవత్సర ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆదివారం రాత్రి 12 గంటల తర్వాత కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ప్రజలు కేక్ కట్ చేశారు. ఆనందోత్సాహాలతో ఒకరి కొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఇండ్ల ఎదుట వాకిళ్లను రంగురంగుల రంగవల్లులతో అలంకరించారు. సోమవారం ఉదయాన్నే కుటుంబ సమేతంగా వెళ్లి, ఆలయల్లో దైవదర్శనం చేసుకున్నారు. దీంతో నియోజకవర్గ వ్యాప్తం గా ఉన్న ఆలయాలు కిటకిటలాడాయి.

మిగతా 2లో..



## అదనంగా అప్పివ్వండి

- -బీఆర్ఎస్ సర్కారు ఖజానా ఖాళీ చేసేసింది
- -ఏడాది కోటా అప్పు 8 నెలల్లో లాగేశారు
- -ఈ 3 నెలలు అప్పు లేకుండా బతికేదెలా?
- -రూ.13 వేల కోట్లిస్తే ఎలాగోలా గట్టెక్కేస్తాం
- -ఇటీవలి భేటీలో ప్రధానిని కోరిన రేవంత్
- -గ్రాంట్లు, పన్నుల్లో వాటా పెద్దగా రాదు
- -భూములు, ఓఆర్ఆర్ ఇప్పటికే అమ్మేశారు
- -వాటిపై వచ్చిన రూ.26 వేల కోట్లు ఊదేశారు
- -మా సర్కారుకు అప్పు దారి లేకుండా చేశారు
- -అప్పిస్తేనే గట్టెక్కుతామని ప్రధానికి వివరణ



• 2లో

## వణికిన జపాన్



కుదిపేసిన వరుస భూ ప్రకంపనలు
ఆ దేశ పశ్చిమ తీరంలో 12కు పైనే!
ఒకదాని తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 7.6
పలుచోట్ల సునామీ హెచ్చరికలు జారీ
ప్రజలు అప్రమత్తం.. ప్రాణ నష్టానికి చెక్

టోక్యో, జనవరి1: కొత్త ఏడాది తొలి రోజునే జపాన్‌ను భూకంపం కుదిపేసింది. వరుస ప్రకంపనలు ఆ దేశ పశ్చిమ తీరాన్ని వణికించాయి. ప్రజలు భయభ్రాంతులకు గురై చంటి పిల్లలతో సహా వీధుల్లోకి వచ్చారు. ప్రభుత్వం అత్యంత తీవ్రస్థాయి సునామీ

మిగతా 2లో..

## తెలంగాణలో నక్సలిజం

# కనుమరుగు

**హైదరాబాద్, జనవరి 1 (అక్షరం న్యూస్)**

అడవి గుండెలో అభివృద్ధి గానం ప్రతిధ్వనించింది. నాడు ఉమ్మడి పాలనలో ఏమాత్రం అభివృద్ధికి నోచుకోని ఆదివాసీ గూడెలు, గిరిజన తండాలు, అటవీప్రాంత గ్రామాల ప్రజలకు స్వరాష్ట్రంలో ఉద్యమ నేత కేసీఆర్ నేతృత్వంలోని గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రగతి ఫలాలను అందించింది. దీంతో గతంలో అడవి బిడ్డల అరణ్యరోదన చూసి వనవాసానికి పూనుకున్న అన్నలు కొండ కోనల్లో వికసిస్తున్న అభివృద్ధి ఫలాలను చూసి అరణ్యవాసాన్ని వీడారు. ఆయుధాలను త్యజించి జనజీవన స్రవంతిలోకి అడుగుపెట్టారు. ఫలితంగా తెలంగాణలో వామపక్ష తీవ్రవాదం పూర్తిగా కనుమరుగైంది.

వామపక్ష తీవ్రవాదానికి గతంలో కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యంగా తెలంగాణలో నేడు అన్నల అలజడి పూర్తిగా తగ్గిపోయింది. స్వరాష్ట్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టణాలు మొదలుకొని మారుమూల ఆదివాసీ గ్రామాల వరకు సంక్షేమ పథకాలను తీసుకెళ్లడంతో మావోయిస్టులు కనుమరుగైనట్టు నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్సీఆర్బీ) నివేదిక వెల్లడించింది. తెలంగాణలోని మావోయిస్టు క్యాడరంతా ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్‌లో మకాం వేయడంతో ఆ రాష్ట్రంలో వామపక్ష తీవ్రవాదం ఎక్కువగా ఉన్నట్టు స్పష్టం చేసింది. 2022లో వామపక్ష తీవ్రవాదానికి ఐదుగురు పోలీసు అధికారులు బలయ్యారు. వారిలో ఓ కానిస్టేబుల్, ఇద్దరు హెడ్‌కానిస్టేబుళ్లు, ఏఎస్ఐ, గెజిటెడ్ ఆఫీసర్ ఉన్నారు. వీరంతా ఛత్తీస్‌గఢ్‌కు చెందినవారే. నిరుడు మావోయిస్టులు బాంబు దాడులు, మందుపాతరలు, ఎదురుకాల్పుల వల్ల 61 మంది తీవ్రంగా (25 మంది కానిస్టేబుళ్లు, 13 మంది హెడ్‌కానిస్టేబుళ్లు, ఆరుగురు ఏఎస్ఐలు, ఇద్దరు ఎస్ఐలు, ఇద్దరు సీఐలు, ముగ్గురు గెజిటెడ్ ఆఫీసర్లు, మరో ముగ్గురు ఇతర విభాగాల అధికారులు) ఉన్నారు. వీరిలో ఛత్తీస్‌గఢ్‌కు చెందినవారే అత్యధికంగా 55 మంది ఉన్నారని.. వీరితోపాటు మహారాష్ట్రకు చెందిన ముగ్గురు, బీహార్‌కు చెందిన ఇద్దరు, తెలంగాణకు చెందిన ఒకరు గాయపడ్డారని ఎన్సీఆర్బీ తెలిపింది. నిరుడు మావోయిస్టులకు, పోలీసులకు మధ్య జరిగిన కాల్పుల వల్ల ఛత్తీస్‌గఢ్, ఒడిశాలో ఇద్దరు పౌరులు మృతి చెందినట్టు వెల్లడించింది.

కమ్యూనిటీ పోలీసింగ్‌తో ప్రజల్లోకి

తెలంగాణలో నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలైన భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, భూపాలపల్లి, మంచిర్యాల, ఆసిఫాబాద్, పెద్దపల్లి జిల్లాల్లో గత బీఆర్ఎస్ ప్రభుత్వం పక్కాగా 'కమ్యూనిటీ పోలీసింగ్'ను అమలు చేసింది. ఆదివాసీ, గిరిజన గ్రామాల్లోని ప్రజలకు రోడ్లు, మంచినీరు, విద్యుత్తు, టీవీ తదితర సదుపాయాలు కల్పించడంతోపాటు విద్యావసతులను మెరుగుపర్చింది. ప్రభుత్వ సహకారంతో పోలీసులు అక్కడి యువతకు వర్క్‌షాపులు నిర్వహించి ఉపాధి చూపడంతోపాటు క్రీడా సదుపాయాలను అందుబాటులోకి తెచ్చారు. ఇందుకోసం ఆ 6 జిల్లాలకు కలిపి ఏటా రూ.50 లక్షల చొప్పున ఖర్చు చేసిన ప్రభుత్వం.. లొంగిపోయిన మావోయిస్టులపై ఉన్న రివార్డులను చెక్కుల రూపంలో వారికే అందజేసే ఏర్పాట్లు చేసింది.

కొత్త రిక్రూట్‌మెంట్లు లేవు

బీఆర్ఎస్ ప్రభుత్వ చర్యలతో గిరిజన, ఆదివాసీ గ్రామాల ప్రజల్లో అనూహ్యమైన మార్పులు వచ్చాయి. అన్యాయాన్ని ఎదిరించాలంటూ గతంలో బిడ్డలకు బందూకులిచ్చి ఉద్యమంలోకి సాగనంపిన తల్లిదండ్రులే నేడు 'చదువుకొని బాగుపడు బిడ్డా' అంటూ పుస్తకాలు చేతిలో పెట్టారు. గురుకులాలు, రోడ్లు అందుబాటులోకి రావడంతో అడవి బిడ్డలంతా చదువుబాట పడుతున్నారు. దీంతో కొత్త రిక్రూట్‌మెంట్లు పూర్తిగా తగ్గిపోయాయి. వ్యక్తిగత కారణాలతో ఎవరైనా అన్నల వెంట వెళ్లినా ఎక్కువకాలం ఉండలేక వెంటనే ఇంటిబాట పడుతున్నారు. క్షణక్షణం భయంతో చనిపోవడం కంటే ధైర్యంగా చదువుకొని మంచి ఉద్యోగాలు సాధించడం ద్వారా తమ వారికి సేవ చేయాలన్న ఆలోచనతో ఎక్కువ మంది వెనక్కి వస్తున్నట్టు పోలీసులు చెప్తున్నారు.

# వణికిన జపాన్

హెచ్చరికలు జారీచేసి లక్షమందిని తక్షణమే ఖాళీ చేయించింది. ఇషికావాలోని నోటోలో మొదట 5.7 తీవ్రతతో ప్రకంపనలు వచ్చాయి. ఇక్కడి తీ రం పరిధిలో స్థానిక కాలమానం ప్రకారం సోమవారం సాయంత్రం 4గంటల సమయం లో 4.0కంటే అధిక తీవ్రతతో మొత్తం 21 ప్రకంపనలు సంభవించాయి. వీటిలో ఒకదాని తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 7.6గా నమోదైందని జపాన్ వాతావరణ శాఖ ప్రకటించింది. ఇషికావాలోని వాజిమా నౌకాశ్రయంలో 1.2 మీట ర్ల ఎత్తులో సునామీ అలలు ఎగిశాయి. వీధు లు, భవనాలు దెబ్బతిన్నాయి. రోడ్లపై పెద్దఎత్తున పగుళ్లు వచ్చాయి. కాగా, హొక్కాయిడో నుంచి నాగసాకి వరకు సునామీ ముప్పుందని అధికారులు వెల్లడించారు. కొన్నిచోట్ల సునామీ అలలు 5మీటర్ల ఎత్తువరకు రావచ్చొని హెచ్చరించారు. ఇషికావాకు తీవ్రమైన, హొన్షు, హొక్కైడో ఇతర ప్రధాన ద్వీపాలకు స్వల్ప స్థాయి సునామీ హెచ్చరికలను జారీ చేశారు. 16.5 అడుగుల ఎత్తున అలలు ఎగిసిపడే ప్రమాదం ఉందని జపాన్ అధికారిక ఎన్‌హెచ్‌కేటీవీ సూచించింది. రాబోయే 2-3 రోజుల్లో తీవ్ర ప్రకంపనలు సంభవించే ప్రమాదం ఉందని హెచ్చరించింది. 10అడుగుల సునామీ అల తీర నగరం నీగాటా, పరిసర ప్రాంతాలను తాకే ప్రమాదం ఉందని ప్రభుత్వ అధికార ప్రతినిధి యోషిమస హయాషి తెలిపారు. భూకంప ప్రాంతాల్లోని అణు కేంద్రాలకు ఎలాంటి ఇబ్బందీలేదని చెప్పారు. కాగా, సోమవారం రాత్రికి సునామీ హెచ్చరికల తీవ్రతను జపాన్ ప్రభుత్వం తగ్గించింది. వరుస ప్రకంపనల కారణంగా 30వేలకుపైగా ఇళ్లకు విద్యుత్తు సరఫరా నిలిచిపోయిందని, 6 ఇళ్లు దెబ్బతిన్నాయని, ప్రజలు చిక్కుకున్నారని, వజిమా, ఇషికావా నగరాల పరిసరాల్లో మంటలు చెలరేగాయని హయాషి వివరించారు.

# నూతన సందడి

అయ్యప్ప ఆలయంలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని, ఆలయ అర్చకులు గురుస్వామి కృష్ణమూర్తి ప్రత్యేక పూజలు చేసి, లక్ష దీపార్చన కార్యక్రమాన్ని ప్రారంభించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో లక్ష దీపాలను ఏర్పాటు చేసి, వెలిగించారు. ఓం స్వస్తిక్, శివలింగం తదితర రూపాల్లో దీపాలను అలకంరించి, లక్ష దీపార్చన చేశారు.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ఆధ్వర్యంలో జవహర్‌నగర్ మేయర్ మేకల కావ్య కేటీఆర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, కోఆప్షన్‌మెంబర్లు, కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కొండల్ ముదిరాజ్, టీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సోరెన్ భార్యకు సీఎం పగ్గాలు..

రాంచీ: మనీ లాండరింగ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న జార?ండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ రాజీనామా చేసి తన భార్య కల్పన సోరెన్ ను సీఎం పీఠంపై కూర్చోబెట్టనున్నారా? అవునంటూ బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే సోమవారంనాడు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు ఆయన ఓ ట్వీట్ చేస్తూ, జేఎంఎం ఎమ్మెల్యే సర్ఫరాజ్ అహ్మద్ తన పదవికి రాజీనామా చేశారని, దానిని సీఎం ఆమోదించారని తెలిపారు. సోరెన్ సైతం ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయనున్నారని, ఆయన భార్య కల్పన సోరెన్ జార?ండ్ తదుపరి సీఎం కానున్నారని అందులో పేర్కొన్నారు.

సోరెన్‌పై కేసు ఏమిటి?

అక్రమ మైనింగ్ వ్యవహారంలో సంబంధం ఉన్న ఆరోపణలపై మనీలాండరింగ్ కేసు కింద సోరెన్ ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ కేసులో డిసెంబర్ 30న ఈడీ ఆయనకు లెటర్-కమ్-సమన్లు పంపింది. మనీలాండరింగ్ కేసులో ప్రశ్నించేందుకు అందుబాటులో ఉండే సమయం చెప్పాలని ఈడీ ఆయనను కోరింది. ఈ కేసులో ఈడీ ఆయనకు సమన్లు పంపడం ఇది ఏడోసారి. అయితే ఇంతవరకూ ఆయన ఈడీ ముందు హాజరుకాలేదు. ఆగస్టు 14న ఈడీ తొలి నోటీసు ఇవ్వగా ఈడీ చర్యల నుంచి ప్రొటక్షన్ కోరుతూ సుప్రీంకోర్టు ముందు, ఆ తర్వాత జార?ండ్ హైకోర్టు ముందు ఆయన పిటిషన్ వేశారు. అయితే ఆయన పిటిషన్లను హైకోర్టు, సుప్రీంకోర్టు కొట్టివేశాయి. తప్పుడు అభియోగాలు, ఉద్దేశాలతో తనకు సమన్లు పంపారని, జార?ండ్‌లో అనిశ్చితి సృష్టించడమే దీని వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశమని సోరెన్ అంటున్నారు. ఈ కేసులో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా, రాంచీ డిప్యూటీ కమిషనర్‌గా గతంలో పనిచేసిన 2011 బ్యాచ్ ఐఏఎస్ అధికారి ఛావి రంజన్‌తో సహా 14 మందిని ఈడీ అరెస్టు చేసింది.

## మేడారం బస్సుల్లో మహిళలకూ చార్జీ

**జాతర్లలో మహిళలకు ఉచిత ప్రయాణం బంద్**
**స్పెషల్ బస్సులు నడపాలని అధికారులకు ఆదేశాలు!**
**ప్రత్యేక సందర్భాల్లో ఫ్రీ ఉత్తమాటే**
**ఉచిత ప్రయాణం దూరం చేసేందుకు సర్కారు వ్యూహం**

**హైదరాబాద్, జనవరి 1 (అక్షరం న్యూస్)**

మేడారం జాతరకు ఆర్టీసీ ప్రయాణికులకు చార్జీల మోత మోగనున్నది. సమ్మక్క-సారలమ్మ జాతర సందర్భంగా పూర్తిగా స్పెషల్ బస్సులనే నడుపాలని ప్రభుత్వం ఆర్టీసీ అధికారులను ఆదేశించినట్టు తెలిసింది. తద్వారా మహాలక్ష్మి పథకం కింద బస్సుల్లో మహిళలకు కల్పిస్తున్న ఉచిత ప్రయాణాన్ని దూరం చేసేందుకు వ్యూహం రచించింది.జనవరిలో సం క్రాంతి పండుగ, ఫిబ్రవరిలో సమ్మక్క-సారలమ్మ జాతల నేపథ్యంలో ఆర్టీసీ బస్సుల్లో లక్షలాది మంది మహిళలు ప్రయాణం చేసే అవకాశం ఉన్నది. అదే జరిగితే నష్టం తప్పదనే భయం ప్రభుత్వంలో నెలకొన్నది. దీంతో పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్‌ల స్థానంలో ప్రత్యేక బస్సులను నడిపించి చార్జీలు వసూలు చేయాలని ఆర్టీసీని ఆదేశించినట్టు తెలుస్తున్నది.

మహిళల ఉచిత ప్రయాణానికి ఎసరు

మహాలక్ష్మి పథకం అమలులో టీఎస్ఆర్టీసీ అధికారులకు రోజుకో కొత్త అనుభవం ఎదురవుతున్నది. బస్సుల్లో ఉచిత ప్రయాణం కార్యక్రమం అమలుకు ముందు నిత్యం రూ.11 కోట్ల నుంచి రూ. 18 కోట్ల ఆదాయం వచ్చేది. ప్రస్తుతం బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణంతో ఆక్యుపెన్సీ పెరిగినా, ఆదాయం భారీగా పడిపోయింది. రోజు సంస్థ ఆదాయం రూ.7 కోట్ల నుంచి రూ.9 కోట్లకు పడిపోయింది.ప్రభుత్వం ఇస్తామని చెప్తున్న రీయింబర్స్‌మెంట్ చెల్లించే వరకూ ఈ భారాన్ని ఆర్టీసీ భరించాల్సి ఉన్నది. ఈ క్రమంలో సమక్క-సారలమ్మ జాతర నేపథ్యంలో లక్షల మంది మహిళలు బస్సుల్లో ప్రయాణిస్తే ఆర్టీసీ నిండా మునిగే ప్రమాదమున్నది. ఈ నేపథ్యంలో మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి ప్రభుత్వం చెక్ పెట్టే దిశగా అడుగులు వేస్తున్నది. పల్లెవెలుగు, ఆర్టీసీ బస్సులను తగ్గించి పూర్తిస్థాయిలో స్పెషల్ బస్సులను నడిపించాలని ఆర్టీసీని ఆదేశించినట్టు సమాచారం.ఇప్పటికే రవాణాశాఖ మంత్రి ఆర్టీసీ అధికారులతో చర్చించినట్టు తెలిసింది. స్పెషల్ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి అనుమతి లేదని ఇప్పటికే ప్రకటించిన నేపథ్యంలో ప్రజల నుంచి వ్యతిరేకత ఉండదని భావిస్తున్నట్టు తెలుస్తున్నది. ప్రభుత్వం వ్యూహాత్మకంగా బస్సుల్లో మహిళ ఉచిత ప్రయాణాన్ని తొలగించే ప్రయత్నాలు చేస్తున్నదని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

పొరుగు రాష్ట్రాల బస్సులపై ప్రభావం

మహాలక్ష్మి పథకంతో టీఎస్ఆర్టీసీ బస్సులు కిటకిటలాడుతున్నా.. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల బస్సులపై ఈ ప్రభావం కనిపిస్తున్నది. తెలంగాణకు వచ్చివెళ్లే ఆయా రాష్ట్రాల బస్సుల్లో సీట్ల భర్తీ నిష్పత్తి (ఓఆర్)లో తగ్గుదల కనిపిస్తున్నట్టు అధికారులు చెప్తున్నారు. అదే సమయంలో టీఎస్ఆర్టీసీ సూపర్ లగ్జరీ, ఏసీ బస్సుల్లోనూ ప్రయాణికులు తగ్గారు.

# ఏపీసీసీ బాధ్యతలు షర్మిలకు!

ఏపీ మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డితో కూడా చర్చిస్తున్నామని, చాలామంది సీనియర్లు కూడా తిరిగి పార్టీలోకి రావడానికి ఆసక్తి చూపుతున్నారని ఆయన చెప్పడం గమనార్హం.

ఫలించిన డీకే మంత్రాంగం

షర్మిలను తిరిగి కాంగ్రెస్‌లోకి తీసుకొనిరావడం, ఆమె పార్టీ వైఎస్ఆర్‌టీపీని కాంగ్రెస్‌లో విలీనానికి ఒప్పించడం వెనుక కర్ణాటక పీసీసీ అధ్యక్షుడు, ఆ రాష్ట్ర డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ మంత్రాంగం ఫలించినట్టు చెప్తున్నారు. దివంగత ఏపీ మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుటుంబానికి డీకే సన్నిహితుడు. ఆ చొరవతోనే కాంగ్రెస్ పెద్దలను ఒప్పించి, ఏపీలో షర్మిలకు పార్టీ పగ్గాలు అప్పగించడానికి ఆయన రంగం సిద్ధం చేసిన విషయం బహిరంగమే. ఆంధ్రలో వైఎస్సార్‌కు ఉన్న పేరును ఉపయోగించుకొని ఆయన రాజకీయ వారసురాలిగా షర్మిల ద్వారా అక్కడ కాంగ్రెస్‌ను బలోపేతం చేసుకుందామన్న డీకే శివకుమార్ వ్యూహానికి పార్టీ పెద్దలు అంగీకరించిన తర్వాతనే ఆమె చేరికకు గ్రీన్ సిగ్నల్ పడినట్టు ఆ పార్టీ వర్గాల సమాచారం. పైగా షర్మిల సోదరుడు, ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జాతీయ రాజకీయాల్లో బీజేపీతో సఖ్యతగా ఉంటున్నారు. ఏపీలో వైసీపీ, టీడీపీ మధ్యనే పోటీ ఉన్నది. కాంగ్రెస్, బీజేపీ రెండు జాతీయ పార్టీలకు అక్కడ చోటు లేకుండా పోయింది.

ఈ నేపథ్యంలో ఏపీలో షర్మిల ద్వారా వైసీపీని బలహీనపరిచి కాంగ్రెస్‌ను బలోపేతం చేయడం మరో వ్యూహం. కాగా సీఎం జగన్‌కు రాజకీయ ప్రత్యర్థి అయిన చంద్రబాబుతో కూడా కాంగ్రెస్ లోపాయికారి సంబంధాలు పెట్టుకునే ప్రయత్నం చేస్తున్నదా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏపీ కాంగ్రెస్ రాజకీయాల్లో చక్రం తిప్పుతున్న డీకే.. ఇటీవల బెంగళూరు ఎయిర్‌పోర్టులో చంద్రబాబుతో ఏమి మాట్లాడారన్నది హాట్‌టాపిక్‌గా మారింది. జగన్‌ను రాజకీయంగా ఎదుర్కోవడానికి షర్మిలను తమ పార్టీ రంగంలోకి దింపుతున్న విషయాన్ని చంద్రబాబుతో డీకే చర్చించి ఉంటారని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. షర్మిలను ఇప్పటికిప్పుడు ఏపీ రాజకీయాల్లోకి తీసుకొనిరావడం వల్ల అక్కడ ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు చీలడం వల్ల సీఎం జగన్‌కే మేలు చేస్తుందన్నది ఒక వాదన కాగా, వైసీపీకి పడే ఓట్లను చీల్చే అవకాశం ఉందనేది మరో వాదన.

కర్ణాటక నుంచి రాజ్యసభకు

సార్వత్రిక ఎన్నికలతోపాటు ఏపీ అసెంబ్లీకి కూడా ఎన్నికలు జరుగనున్నాయి. ప్రస్తుతం అక్కడ కాంగ్రెస్ పార్టీ అధికారం చేజిక్కించుకోగలిగే స్థితిలో లేకపోవడంతో 2029 ఎన్నికలే టార్గెట్‌గా షర్మిలను ఇప్పటినుంచే రంగంలోకి దింపాలని కాంగ్రెస్ యోచిస్తున్నట్టు తెలిసింది. షర్మిలను 2029 ఎన్నికల్లో సీఎం అభ్యర్థిగా ఇప్పటి నుంచే ప్రొజెక్టు చేయాలని కాంగ్రెస్ పెద్దలు భావిస్తున్నట్టు సమాచారం. ఇప్పటినుంచే ఏపీలో గ్రౌండ్ ప్రిపేర్ చేయాలన్నది కాంగ్రెస్ వ్యూహమని చెప్తున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కడప నుంచి షర్మిలను ఎంపీగా పోటీ చేయించడం ద్వారా ఏపీలో పార్టీకి ఊపు తీసుకరావచ్చు అన్నది కాంగ్రెస్ వ్యూహం. ఒకవేళ ఆమె కడప నుంచి పోటీకి అంగీకరించని పక్షంలో కర్ణాటక నుంచి రాజ్యసభకు పంపించేలా కాంగ్రెస్ పెద్దలు ప్లాన్-బీ కూడా సిద్ధం చేసినట్టు ఈ వర్గాల సమాచారం.

# బియ్యం@ 6,200

**హైదరాబాద్, జనవరి 1 (అక్షరం న్యూస్)**

నిన్నమొన్నటి వరకు వంటనూనెలు, కూరగాయల ధరలు సామాన్యులను భయపెడితే ఇప్పుడా జాబితాలోకి బియ్యం వచ్చి చేరాయి. గతంలో ఎన్నడూ లేనంతగా బియ్యం ధరలు పెరుగుతుండడం కలవరపెడుతున్నది. నిన్నమొన్నటి వరకు కిలో బియ్యం రూ. 45 నుంచి రూ.50 మధ్య లభించగా ఇప్పుడా ధర ఏకంగా రూ. 60కి పెరిగింది. కొంచెం మంచి రకాలైతే రూ. 70 వరకు చెల్లించుకోవాల్సి వస్తున్నది. ప్రజలు ఎక్కువగా వినియోగించే సన్న రకాలైన బీపీటీ, హెచ్ఎంటీ, సోనామసూరి ధరలు సగటున క్వింటాలుకు రూ.1000 నుంచి రూ. 1500 వరకు పెరిగాయి. నిరుడు క్వింటాలు రూ. 4,500 నుంచి రూ. 5 వేల మధ్య లభించగా ఇప్పుడు ఏకంగా రూ. 6,200 వరకు పెరిగింది. ఇందులో పాతబియ్యం అయితే రూ.7,500 వరకు పలుకుతున్నది. హెచ్ఎంటీ, బీపీటీ కొత్త రకం బియ్యం ధర గతంలో క్వింటాలుకు రూ. 3,300 నుంచి రూ. 3,500 వరకు ఉండగా ఇప్పుడది రూ. 4,500కు చేరింది. మొత్తంగా బియ్యం ధరలు సగటున రూ. 1000 పెరిగాయి.

తగ్గిన సన్నాల సాగు

బియ్యం ధరల పెరుగుదలకు ఆయా రాష్ట్రాల్లో వరిసాగు తగ్గడం కూడా ఒక కారణమని చెప్తున్నారు. నిజానికి ఈ వానకాలంలో దేశవ్యాప్తంగా వరిసాగు పెరిగినప్పటికీ కొన్ని రాష్ట్రాల్లో మాత్రం వర్షాభావ పరిస్థితులకు తోడు, మరికొన్ని రాష్ట్రాల్లో వరదల కారణంగా భారీగా పంటనష్టం సంభవించింది. ఇది అంతిమంగా బియ్యం ధరపై ప్రభావం చూపిస్తున్నది. దీనికితోడు సన్నాల సాగు కూడా గణనీయంగా పడిపోయింది. ప్రతి ఏటా వానకాలంలో మొత్తం సాగులో 50 శాతం సన్నాలు ఉండగా, ఈసారి మాత్రం 30 శాతానికే పరిమితమైంది. తెలంగాణలో ఈ వానకాలంలో రికార్డుస్థాయిలో 65 లక్షల ఎకరాల్లో వరిసాగైంది. ఈ లెక్కన దాదాపు 1.40 కోట్ల టన్నుల ధాన్యం ఉత్పత్తి కావాల్సి ఉండగా పౌరసరఫరాల సంస్థ కొనుగోలులో ఇది 45 లక్షల టన్నులకే పరిమితమైంది. గతంలో ఎంతోకొంత సన్నాలు వచ్చేవి. ఈ సీజన్‌లో మాత్రం కేజీ బియ్యం కూడా కొనుగోలు కేంద్రాలకు రాలేదు. బియ్యం ధరలు అమాంతం పెరగడంతో సామాన్యుల బడ్జెట్‌కు చిల్లు పడుతున్నది.

మరింత పెరిగే అవకాశం

బియ్యానికి ప్రస్తుతం ఉన్న డిమాండ్‌ను మిల్లర్లు సొమ్ము చేసుకుంటున్నారన్న విమర్శలు కూడా ఉన్నాయి. హైదరాబాద్‌లో సాధారణ రకం బియ్యం 25 కిలోల బస్తా ధర రూ. 180 నుంచి రూ. 250 చొప్పున పెరిగింది. ఈ లెక్కన గతంలో రూ.1200 ఉన్న 25 కిలోల బస్తా ధర ప్రస్తుతం రూ. 1,350 వరకు ఉంది. ఫైన్ క్వాలిటీ బియ్యమైతే రూ. 1,650-1,800 మధ్య పలుకుతున్నది. ఇదే పరిస్థితి కొనసాగితే ముమ్ముందు ధరలు మరింత పెరగక తప్పని పరిస్థితి నెలకొంటుందని వ్యాపారులు చెప్తున్నారు

## నా వద్ద చెప్పేది ఒకటి.. చేసేది

# మరొకటి ఉండదు..

ల్లమధ్య జీరో కాలుష్యం తో ప్రత్యేక క్లస్టర్లను ఏర్పాటు చేస్తాం. ప్రత్యేక క్లస్టర్ల వద్ద పరిశ్రమల్లో పనిచేసే వారికి ఇళ్ల నిర్మాణం చేపడతాం. కార్మికులు హైదరాబాద్ వరకు రాకుండా అక్కడే అన్ని ఏర్పాట్లు చేస్తాం. యువతకు అవసరమైన నైపుణ్యాలు పెంచేందుకు ప్రత్యేక విశ్వవిద్యాలయాలు ఏర్పాటు చేస్తాం. అంతర్జాతీయ స్థాయిలో ప్రమాణాలు కలిగిన సంస్థలు, ప్రముఖ పారిశ్రామికవేత్తల ద్వారా శిక్షణ ఉంటుంది. ఈ నైపుణ్యాలకు సాధారణ డిగ్రీలకు ఉండే అర్హతలన్నీ ఉంటాయి" అని సీఎం వివరించారు.

100 పడకల ఆస్పత్రి ఉన్న చోట నర్సింగ్ కళాశాల..

"ఇప్పటికే అధికారాన్ని వికేంద్రీకరించాం. ఉమ్మడి జిల్లాలకు ఇంఛార్జిలుగా మంత్రులకు బాధ్యతలు అప్పగించాం. 100 పడకల ఆస్పత్రి ఉన్న చోట నర్సింగ్ కళాశాల ఉంటుంది. విదేశాలకు వెళ్లే యువతకు ఓరియంటేషన్ ఇప్పిస్తాం. ఆయా దేశాలకు అవసరమైన మ్యాన్‌పవర్‌ను ప్రభుత్వం ద్వారా అందిస్తాం. తద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో యువత ఉంది. వారికి ఆసక్తి కలిగిన విభాగాల్లో శిక్షణ ఇప్పిస్తాం" అని సీఎం తెలిపారు.

నా వద్ద చెప్పేది ఒకటి.. చేసేది మరొకటి ఉండదు..

"మూడు కమిషనరేట్లకు కమిషనర్లను నియమించా. వారికి అవసరమైన సిబ్బందిని వారే ఎంపిక చేసుకుంటారు. శాఖలకు ప్రతిభ కలిగిన అధిపతులను నియమించడం వరకు నేను చూస్తాను. వాళ్ల పరిధిలో అవసరమైన అధికారులను నియమించుకొని యంత్రాంగం సక్రమంగా పనిచేసేలా వారే చూసుకోవాలి. అధికారుల నియామకాల్లో సామాజిక న్యాయం కూడా జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. సంస్కరణలు తీసుకొచ్చి స్ట్రీమ్ లైన్ చేసే పనిలో ఉన్నాం. నా వద్ద చెప్పేది ఒకటి.. చేసేది మరొకటి ఉండదు. ప్రెస్ అకాడమీ ఛైర్మన్ నియామకం తర్వాతే జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తాం. జర్నలిస్టులకు సంబంధించిన అన్ని సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరిస్తాం. ఇప్పటినుంచి వంద రోజుల్లో పరిష్కరిస్తాం.

3వ తేదీన పీసీసీ విస్తృతస్థాయి సమావేశం ఉంది..

జనవరి 3వ తేదీన పీసీసీ విస్తృతస్థాయి సమావేశం ఉంటుంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు పదవులు కేటాయిస్తాం. పార్టీ కోసం పనిచేసిన వారితో నామినేటెడ్ పదవులు భర్తీ చేస్తాం. నాకు దగ్గరగా ఉంటాడనో.. లేదా బంధువనో.. పదవులు ఇవ్వడం ఉండదు. ఏది చేసినా విస్తృత ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని పదవులు భర్తీ చేస్తాం"అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు.

# అదనంగా అప్పివ్వండి

**హైదరాబాద్, జనవరి 1 (అక్షరం న్యూస్)**

రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆర్థిక సంక్షోభం ముంచుకొచ్చింది. తాను ప్రకటించిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడానికి నిధుల కరువు ఏర్పడింది. నిధుల సమీకరణకు అప్పు తప్ప వేరే మార్గం కనిపించడం లేదు. ఎన్నికల ముందు భూముల అమ్మకం ద్వారా వచ్చిన భారీ మొత్తాలను బీఆర్ఎస్ సర్కారు వాడేసింది. బడ్జెట్‌లో పొందుపర్చిన అప్పులన్నీ కోటా మేరకు దాదాపుగా తీసేసుకుంది. ఈ రెండు ప్రధాన మార్గాలు మూసుకుపోవడంతో కొత్త ప్రభుత్వానికి కేంద్రం దయే శరణ్యమైంది. ఎఫ్ఆర్‌బీఎం పరిమితికి మించి అదనపు అప్పు ఇవ్వాలని కోరుతోంది. ఈ అదనపు అప్పు పుడితేనే ఎంతో కొంత గట్టెక్కవచ్చన్నది సర్కారు ఆలోచన. అందుకే, 2023-24 ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో

మరో రూ.13 వేల కోట్ల మేర అప్పు పుట్టేలా సహకరించాలని కేంద్రాన్ని కోరుతోంది. ఇటీవల ఢిల్లీకి వెళ్లి ప్రధాని మోదీని కలిసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అదనపు అప్పు విషయాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన గ్రాంట్లను విడుదల చేయాలని, అదనపు అప్పు తీసుకోవడానికి అనుమతించాలని కోరారు. అయితే... కేంద్ర ప్రభుత్వం ఈ అప్పుపై ఎలా స్పందిస్తున్నది వేచి చూడాలి.

మూడు నెలలు ముందుగానే ఖాళీ

2023-24 ఆర్థిక సంవత్సరానికి బీఆర్ఎస్ ప్రభు త్వం రూ.2,90,396 కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ఇందులో రూ.40,615 కోట్ల మేర అప్పు తీసుకుంటామని ప్రతిపాదించగా... నవంబరు నాటికి రూ.38,151 కోట్లు, డిసెంబరులో మరో రూ.900 కోట్లు.... మొత్తం రూ.39,051 కోట్ల మేర అప్పును తీసేసుకున్నారు. అంటే ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.1000 కోట్లు మినహా అంచనా వేసిన మేర అప్పును తీసుకున్నట్లయింది. చివరి త్రైమాసికం(జనవరి, ఫిబ్రవరి, మార్చి) మిగిలి ఉండగానే... మొత్తం అప్పును లాగేసినట్లయింది. దీంతో మిగతా మూడు నెలల కాలానికి నిధులు ఎక్కడి నుంచి తేవాలన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను ప్రకటించింది. వీటి కోసం దరఖాస్తులను స్వీకరిస్తోంది. వంద రోజుల్లో ఈ స్కీములను అమలు చేస్తామని చెప్పినందున నిధుల కొరత తప్పడం లేదు. దాంతో చివరి త్రైమాసికం గడవడానికి అదనంగా రూ.13 వేల కోట్ల అప్పు ఇవ్వాలని కొత్త ప్రభుత్వం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను కోరింది. జనవరిలో రూ.4000 కోట్లు, ఫిబ్రవరిలో రూ.2000 కోట్లు, మార్చిలో రూ.6000 కోట్లు... ఇలా మొత్తం రూ.13 వేల కోట్ల అప్పు తీసుకుంటామని ప్రతిపాదించింది. ఇప్పటికే బడ్జెట్‌లో అంచనా వేసిన మేర అప్పును తీసుకున్నందున... దీనిని అదనపు అప్పుగా తీసుకోవడానికి అనుమతించాలని కేంద్రాన్ని కోరుతోంది.

మూసుకుపోయిన మార్గాలు

రాష్ట్ర ప్రభుత్వానికి ఇతరత్రా ఆదాయ మార్గాలు పెద్దగా కనిపించడం లేదు. కొత్తగా అధికారంలోకి రావడం, అప్పటికే గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నదంతా ఊడ్చేయడంతో ఇప్పుడు సందిగ్ధత నెలకొంది. పన్నేతర రాబడుల కింద బీఆర్ఎస్ ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.22,808 కోట్లను ప్రతిపాదించింది. ఇందులో ప్రధానంగా భూముల అమ్మకం ద్వారానే నిధులు సమకూరుతాయి. నవంబరు నాటికే పన్నేతర రాబడుల కింద రూ.19,524 కోట్ల నిధులను రాబట్టారు. అంటే... దాదాపు 85.60 శాతం నిధులను రాబట్టుకున్నారు. ఔటర్ రింగు రోడ్డు టోల్ కలెక్షన్ టెండర్ల ద్వారా మరో రూ.7,380 కోట్లను రాబట్టారు. ఇలా పన్నేతర ఆదాయం కింద దాదాపు రూ.26,804 కోట్లు వచ్చాయి. అంటే, బడ్జెట్లో పెట్టిన దానికన్నా దాదాపు ఆరువేల కోట్లు అదనంగా ఈ అమ్మకాలతో వచ్చాయి. అవన్నీ ఖర్చయ్యాయి. బడ్జెట్‌లో ప్రతిపాదించిన కేంద్ర గ్రాంట్లు ఆశాజనకంగా కనిపించడం లేదు. ఏటా ఇవి ప్రతిపాదించిన మేర రావడం లేదు. ఈ సంవత్సరం గ్రాంట్ల కింద రూ.43,294 కోట్లను ప్రతిపాదించారు. కానీ... నవంబరు నాటికి కేవలం 10.99 శాతం అంటే... రూ.4,532 కోట్లు మాత్రమే వచ్చాయి. మిగతా నాలుగు నెలలను పరిగణనలోకి తీసుకున్నా... రాష్ట్రాన్ని ఆదుకునే స్థాయిలో ఉండకపోవచ్చు. కేంద్ర పన్నుల్లో వాటా నిధులను కూడా నిక్కచ్చిగా అంచనా వేయలేని పరిస్థితి నెలకొంది. ఈ పద్దు కింద కేంద్రం నుంచి రూ.14,528కోట్లు వస్తాయని అంచనా వేయగా... నవంబరు నాటికి రూ.8,177 కోట్లు (56.29%) మాత్రమే వచ్చాయి. అప్పుల మార్గం పూర్తిగా మూసుకుపోయింది. ఇలా అన్ని రకాల ఆదాయ మార్గాలు మూసుకుపోయి, కేంద్రమే నిబంధనలు సడలించి ఆదుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

గత రెండేళ్లలో ఇలా తోడేయలేదు

ఈ సారి బడ్జెట్‌లో అంచనా వేసిన మేర అప్పుల లక్ష్యం తొమ్మిది నెలలకే పూర్తి కావడంతో చివరి త్రైమాసికం పరిస్థితి ఆందోళనలో పడింది. నిజానికి ప్రతి ఆర్థిక సంవత్సరం చివరి క్వార్టర్ వరకు ప్రభుత్వాలు అప్పులు తీసుకుంటూ ఉంటాయి. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు 2021-22, 2022-23 ఆర్థిక సంవత్సరాల్లో కూడా చివరి క్వార్టర్ల వరకు అప్పులు తీసుకుంటూ వచ్చింది. 2021-22 ఆర్థిక సంవత్సరంలో చివరి మూడు నెలల క్వార్టర్‌లో జనవరిలో రూ.6,187 కోట్లు, ఫిబ్రవరిలో రూ.4000 కోట్లు, మార్చిలో రూ.2029 కోట్లు చొప్పున మొత్తం రూ.12,216 కోట్ల అప్పు తీసుకుంది. ఆర్థిక సంవత్సరం చివర్లో ఖర్చులకు ఇబ్బంది పడకుండా ఉండటానికి ప్రభుత్వాలు తమ అప్పుల కోటాను జాగ్రత్తగా వాడుకుంటూ ఉంటాయి. 2022-23 ఆర్థిక సంవత్సరంలోని చివరి త్రైమాసికానికి సంబంధించి జనవరిలో రూ.4,500 కోట్లు, ఫిబ్రవరిలో రూ.3000 కోట్లు, మార్చిలో రూ.4,150 కోట్లు చొప్పున అప్పటి బీఆర్ఎస్ సర్కారు మొత్తం రూ.11,650 కోట్ల మేర అప్పు తీసుకుంది. ఎన్నికల సంవత్సరం మాత్రం ఈ జాగ్రత్తలేవీ పాటించలేదు. 2023-24 ఆర్థిక సంవత్సరం విషయానికొచ్చేసరికి ఎనిమిది నెలల్లోనే తన కోటా అప్పులన్నీ లాగేసింది. చివరి త్రైమాసిక అప్పు తీసుకోవడానికి వీల్లేకుండా పోయింది. జనవరి, ఫిబ్రవరి, మార్చిలో అప్పు పుట్టే పరిస్థితి లేకుండా పోయింది. ఈ నేపథ్యంలోనే అదనపు అప్పు ఇవ్వాలని రాష్ట్రంలోని కొత్త ప్రభుత్వం కేంద్రాన్ని కోరుతోంది. పన్నేతర రాబడుల మార్గం లేకపోవడం, రాష్ట్ర ప్రభుత్వ కోటా అప్పులను బీఆర్ఎస్ ప్రభుత్వం 8 నెలల్లోనే వాడేయటం కేంద్ర గ్రాంట్లలో పెద్దగా ఆశ లేకపోవడం, కేంద్ర పన్నుల ద్వారా వచ్చే ఆదాయం రాష్ట్ర ప్రభుత్వం ఆశించిన స్థాయిలో ఉంటుందా? లేదా అన్న సందిగ్ధత వంటి పరిస్థితులన్నింటినీ ప్రధాని మోదీకి రేవంత్ వివరించారు. అదనపు అప్పు తీసుకుంటే తప్ప... ముందుకు వెళ్లలేని పరిస్థితి నెలకొందని తెలిపారు. వచ్చే 3నెలల కోసం మరో 13వేల కోట్ల అదనపు అప్పు తీసకోవడానికి అనుమతించాలని కోరారు.

పొరుగు రాష్ట్రాలదీ ఇదే డిమాండ్

అప్పు కోసం కష్టాలు ఒక్క తెలంగాణవే కాదు. ఈ ఆర్థిక సంవత్సరంలో అదనంగా మరో రూ.37 వేల కోట్ల అప్పు తీసుకోవడానికి అనుమతించాలంటూ తమిళనాడు ప్రభుత్వం కేంద్రాన్ని కోరుతోంది. ఇప్పటికే ఆ రాష్ట్రం 76 వేల కోట్ల మేర అప్పు తీసుకుంది. 37వేల కోట్లు అదనంగా కోరుఓతంది. కేరళ ప్రభుత్వం ఏకంగా అదనపు అప్పులకు అవకాశం ఇవ్వాలంటూ కోర్టునే ఆశ్రయించింది. తమ రాష్ట్రానికి అప్పులను తిరిగి చెల్లించే ఆర్థిక పరిపుష్టి ఉందని, అయినా... కేంద్ర ప్రభుత్వం అప్పులపై ఆంక్షలు విధిస్తోందని వాదిస్తోంది. అప్పులను తిరిగి చెల్లించే సామర్థ్యం ఉన్నప్పుడు ఎందుకు అనుమతించడం లేదని ప్రశ్నించింది. ఇలా పొరుగు రాష్ట్రాలు కూడా అప్పుల కోసం పోరాటం చేస్తున్న నేపథ్యంలో తెలంగాణకు ఎంతోకొంత అదనపు అప్పు వస్తుందన్న భరోసా లభిస్తోంది. తమకూ అదనపు అప్పు కోసం అనుమతించాలని రాష్ట్రం డిమాండ్ చేస్తోంది.

# మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం ప్రగతి పథంలో ప్రయాణించింది

**స్వరాష్ట్ర సాధన రామగుండం ప్రాంతం పోరాటం చారిత్రాత్మకం.**
**కాంగ్రెస్ పార్టీ హామీలన్ని నెరవెర్చాలి.**
**బీ.ఆర్.ఎస్ పార్టీ కోసం శ్రమిస్తున్న వారికి సమచిత స్దానం.**
**రామగుండం ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు.**
**రామగుండం మాజీ ఎమ్మెల్యే బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కోరుకంటి చందర్.**

**గోదావరిఖని ప్రతినిధి/పెద్దపల్లి/జనవరి 1/అక్షరం న్యూస్:**
తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ నాయకత్వం లో 10 ఎళ్ల పాలనలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనించిదని,ప్రతి ఇంటికి సంక్షేమ ప్రతి ముఖంలో కేసీఆర్ అనందం నింపారని రామగుండం మాజీ ఎమ్మెల్యే బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కోరుకంటి చందర్ అన్నారు.సోమవారం గోదావరిఖని ప్రధాన చౌరస్తాలోని బీ.ఆర్.ఎస్ పార్టీ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలను బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కోరుకంటి చందర్ నిర్వహించారు. కార్యాలయం లో కెక్ కట్ చేసి స్వీట్లు పంచారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనోద్యమంలో రామగుండం ప్రాంత ప్రజలు సాగించిన పోరాటం చారిత్రాత్మకం అన్నారు. తెలంగాణ తోలి ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని సంక్షేమం అభివృద్ధిలో దేశంలోనిఅగ్రభాగాన నిలిపారని అన్నారు.బీ.ఆర్.ఎస్ పార్టీ అభివృద్ధి కోసం అహర్నిషలు కృషి చేస్తున్న పార్టీ శ్రేణులకు సమచిత స్దానం వస్తుందన్నారు.రాబోవు సర్పంచ్ ఎంపిటీసి జడ్పీటీసీ కార్పోరేషన్ ఎన్నికల్లో అవకాశం వస్తుందన్నారు.రాబోయే ఎన్నికైన బీఆర్ఎస్ పార్టీ గెలుపు కోసం కార్యకర్తలు నాయకులు సైనికుల్లా పనిచేయాలని అన్నారు.కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ లన్నీ నెరవేర్చాలన్నారు.ప్రజల పక్షాన ఉండి ప్రజల సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తామన్నారు. తాము ఎమ్మెల్యే రామగుండం నియోజకవర్గం లో మెడికల్ కళశాల సబ్ రిజిస్టర్ కార్యాలయం ఇండస్ట్రీయల్ పార్కు సీనియర్ సివిల్ కోర్టు జడ్జి భవనం సాధించామన్నారు.రామగుండం నియోజకవర్గం లోని బీఆర్ఎస్ పార్టీ



నాయకులకు కార్మికులకు కర్షకులకు సకలజనుల అందరికీ ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో రామగుండం నగర డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్ రావు,కార్పోరేటర్ ఇంజపురి పులిందర్,దొంత శ్రీనివాస్,దాతు శ్రీనివాస్,సాగంటి శంకర్,కల్వచర్ల కృష్ణ వేణి,బీ.ఆర్.ఎస్ పార్టీనాయకులు గోపు ఐలయ్య యాదవ్,నడిపెల్లి మురళీధర్ రావు, మాదాసు రామమూర్తి,చల్లగురుగుల మెగిళి,దాసరి ఎల్లయ్య,ముప్పిడి సత్యప్రసాద్,అచ్చె వేణు, నారాయణదాసు మారుతి,నూతి తిరుపతి,పిల్లి రమేష్,వాసు,మేతుకు దేవరాజు,గుంపుల ఓదేలు యాదవ్,జక్కుల తిరుపతి,తోకల రమేష్,ఆడ్లూరి రాములు,గడ్డం నారాయణ,అమరేందర్, బెంద్రే నాగభూషణం గౌడ్,బండ రాజు,అల్లం అయులయ్య, ముద్దసాని సంధ్యా రెడ్డి,మేకల సరోజన,మల్లికాంభా, గుర్రం రమాదేవి,కొమురమ్మ తదితరులు పాల్గొన్నారు.

## నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసిన జిఎం ఏ.పి.ఏ

**రామగిరి (పెద్దపల్లి జిల్లా) జనవరి 01 అక్షరం న్యూస్:**
అడ్రియాల లాంగ్ వాల్ గని ఆవరణంలో సోమవారం నూతన సంవత్సరం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిఎం ఏపీఏ కె. వెంకటేశ్వర్లు, ప్రాజెక్ట్ అధికారి కె. నాగేశ్వరరావు లు కేకును కట్ చేసి అధికారులకు, ఉద్యోగులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.సందర్భంగా సింగరేణి దినోత్సవ వేడుకల్లో ఉత్తమ అధికారిగా ఎంపికై నటువంటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి. మహేష్ తోపాటు, ఏ ఎల్ పి గనిలో గత 13 సంవత్సరాలుగా వివిధ హెూదాల్లో విధులు నిర్వహిస్తూ ఏ ఎన్ ఎన్ మరియు న్యూ మెరికల్ మోడలింగ్ టెక్నాలజీ తో పాటు ఫీల్డ్ మానిటరింగ్ కన్వర్జెన్సీ డేటాను ఉపయోగించి గేట్ రోడ్డు స్పెషాలిటీ విశ్లేషణ మీద పీ హెచ్ డి పట్టాను అందుకున్న అడిషనల్ మేనేజర్ కె. శ్రీకాంత్ లను శాలువాతో సత్కరించి, అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు ఇంజనీర్ టీ. రఘురాం, ఎస్ ఓ ఎం లు కె. జనార్ధన్, కె. తిరుపతి, సేఫ్టీ ఆఫీసర్ ఎం. రమేష్, పిట్ ఇంజనీర్ కే పి జే వెంకటేష్ లతోపాటు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## చర్చిలో నూతన సంవత్సర వేడుకలలో పాల్గొన్న ఎమ్మెల్యే



**పెద్దపల్లి టౌన్ జనవరి 01 అక్షరం న్యూస్**
పెద్దపల్లి పట్టణంలోని శాంతి నగర్ న్యూ బిలివర్ చర్చిలో 2024 నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొని నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటూ పెద్దపల్లి నియోజకవర్గ ప్రజలందరికి ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు నాయకులు నుగిళ్ళ మల్లయ్య సయ్యిద్ మస్రత్ భుతగడ్డ సంపత్ ఉప్పు రాజు బొడ్డుపల్లి శ్రీనివాస సుడమల్ల అమిరేష్ దొడ్డుపల్లి జెగదిష్ బండారి సునీల్ గౌడ ఎండీ నదేం దేవరకొండ రజు శ్రావణ్ చర్చి ఫాస్టర్స్ మరియు మహిళలు యువకులు తదితరులు పాల్గొన్నారు

# కలిసికట్టుగా పనిచేసే నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలి

**- ఆర్జి-3 ఏపీ ఏ జీఎంలు**
**- డిసెంబర్ నెలలో సాధించిన ఉత్పత్తి ఉత్పాదక పై సమీక్ష సమావేశం**


**రామగిరి (పెద్దపల్లి జిల్లా) జనవరి 01 అక్షరం న్యూస్:**

కార్మికులు అధికారులు కలిసికట్టుగా నిర్వహించవలసిన విధులు నిర్వహిస్తేనే నిర్దేశించే లక్ష్యాలను అధిగమించగలుగుతామని ఆర్జీ -3 జి యం
ఎన్. సుధాకరరావు, ఏ .పీ. ఏ జీ ఎం కే.వెంకటేశ్వర్లులి తెలిపారు. సోమవారం సెంటినరీ కాలనీలోని స్థానిక రామగిరి అతిథి గృహము లో ఏర్పాటుచేసిన పత్రికా విలేఖరుల సమావేశంలో డిసెంబర్ నెల బొగ్గు ఉత్పత్తి, రవాణా వివరాలను ఆర్జీ 3, ఏ పి ఏ జిఎంలు తెలిపారు..ఈ సందర్భంగా ఆర్జి-3 ఏరియా జి.యం ఎన్. సుధాకరరావు మాట్లాడుతూ డిసెంబర్ నెలలో ఆర్.జి.3 ఏరియాకు నిర్దేశించిన 5.60 లక్షల టన్నులకు గాను 5.32 లక్షల టన్నులు అనగా 95 శాతం బొగ్గు ఉత్పత్తితో పాటు 85 శాతం మట్టి తీయడం మరియు 8.01 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేయడం జరిగిందన్నారు. ఓ.సి-2 ఉపరితల గని భవిష్యత్తు కోసం చేపట్టినటువంటి భూ సేకరణ ప్రక్రియలో భాగంగా సంబంధిత గ్రామాల ప్రజలు సహకరించాలన్నారు. వారికి చట్ట ప్రకారం రావాల్సిన వాటన్నింటినీ ఇవ్వడంకోసం సంస్థ యాజమాన్యం కృషి చేస్తుందన్నారు.అలాగే అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జి.యం. కె . వెంకటేశ్వర్లు మాట్లాడుతూ డిసెంబర్ నెలలో అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాకు నిర్దేశించిన 1.50 లక్షల టన్నులకుగాను 1.53 లక్షల టన్నులు అనగా 102 శాతం బొగ్గు ఉత్పత్తితో పాటు 1.50 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేయడం




జరిగిందన్నారు. భవిష్యత్తులో నిర్దేశించిన లక్ష్యాలకనుగుణంగా పని చేయడానికి కృషి చేస్తామన్నారు. 2023 లో అందరము కలసి కట్టుగా భద్రత తో ఉత్పత్తి లక్ష్యాలను సాధించు కున్నామో, అదేవిధంగా ఈ నూతన సంత్సరము లో కూడా భద్రత తో నిర్దేశించిన లక్ష్యాలను సాధించు కోవాలని అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు జిఎంలు తెలియజేశారు.ఈ కార్య క్రమములో ఏరియా ఇంజినీర్ పీ. ఎలీషా, ఎస్వో టు జీ జి.రఘు పతి, ఏ.జీ.ఎం(ఫైనాన్స్) పి. శ్రీనివాసులు, ప్రాజెక్ట్ అధికారులు ఎన్ . రాధ కృష్ణ, కే.రాజేందర్, ఎన్.రమేశ్,డి.జి.ఎం(ఐ.ఈ) కే.చంద్రశేఖర్, సివిల్ డి జి ఎం పద్మ రాజు, పర్సనల్ మేనేజర్ ఎం. రవీందర్ రెడ్డి,డీ.వై.పీ.ఎం.గుర్రం శ్రీహరి లతో పాటు ఇతర విభాగాల అధిపతులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు..

## ఇంటింటికి శ్రీరాముని అక్షింతలు పంచిన బిజెపి నాయకులు.



**హనుమకొండ/ పరకాల/ జనవరి 01,అక్షరం న్యూస్.**
అయోధ్య శ్రీ రామచంద్రుని అక్షింతలు దేశం మొత్తం పంచే కార్యక్రమం దేశ ప్రధాని నరేంద్ర మోడీ తీసుకొని దేశంలోని ప్రతి రాష్ట్రంలోని కు గ్రామానికి సైతం చేరే విధంగా ప్రణాళికలు తయారు చేశారు. అందులో భాగంగా సోమవారం పరకాల పట్టణంలోని అంబేద్కర్ విగ్రహ కూడలిలో ఆర్ఎస్ఎస్ రాష్ట్ర ప్రాంత కార్యదర్శి కాచం రమేష్ జి ఆధ్వర్యంలో డప్పు వాయిద్యాలతో అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యులు కాచం గురుప్రసాద్ ,హనుమకొండ జిల్లా కార్యదర్శి ఎర్రం రామన్న, వైశ్య సంఘ నాయకులు సూర్యదేవర సదానందం, సూర్యదేవ శ్రవణ్ కుమార్, తమ్మిశెట్టి వెంకన్న, మరెడుగొండ భాస్కరరవు, గోపిషెట్టి వెంకటేశ్వర్లు, కోమెరవెల్లి శ్రీనివాస్, హైమవతి, రాజమణి, జయలక్ష్మి,సంధ్యారాణి, స్వరాజ్యలక్ష్మి, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నర్సక్కపల్లి ఎంపీటీసీ జన్మదిన వేడుకలు.



**హనుమకొండ/ పరకాల/ జనవరి 01,అక్షరం న్యూస్.**
నడికూడ మండల నర్సక్కపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీ బుర్ర దీప జన్మదిన వేడుకలు అనందోత్సవాల నడుమ పార్టీ నాయకులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బంగా పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి,మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య కలిసి ఎంపీటీసీజన్మదిన వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఎంపీటీసీ బుర్ర దీప ఎమ్మెల్యే ఆశీస్సులు తీసుకున్నారు.ఈ కార్యక్రమంలో నడికూడ, పరకాల మండలాల ప్రజాప్రతినిధులు, మండల అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## మండల కేంద్రంలో శ్రీరామ అక్షింతల శోభాయాత్ర

**- కన్నుల పండుగగా కొనసాగిన శోభాయాత్రలో పాల్గొన్న గ్రామస్తులు.**



**భద్రాద్రి కొత్తగూడెం, పినపాక, జనవరి 01(అక్షరంన్యూస్):**
మండల కేంద్రంలో శ్రీరామ జన్మభూమి అయోధ్య అక్షింతల శోభాయాత్రను స్థానిక సర్పంచ్ గొగ్గల నాగేశ్వరరావు గ్రామస్తులతో కలిసి ప్రారంభించడం జరిగింది. రామాలయం ఆలయ ధర్మకర్త ఎర్ర ప్రగడ రామమూర్తి ఇంటి నుంచి ఈ యాత్రను ప్రారంభించగా గ్రామస్తులు ,మహిళలు, చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీరామ నామాన్ని జపిస్తూ అక్షింతల శోభాయాత్రను కన్నుల పండుగగా జరిపించారు.దీనిలో భాగంగా అయోధ్య పూజిత శ్రీరామ అక్షింతలు గడపగడపకు చేరవేస్తూ జనవరి 22వ తారీఖున పూజించాల్సిన విధానాన్ని ప్రతి కుటుంబానికి ఆలయ కమిటీ సభ్యులు వివరించడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ గొగ్గల నాగేశ్వరరావు మాట్లాడుతూ శ్రీరాముడు చూపించిన మార్గంలో ప్రతి ఒక్కరు కలిసి నడవాలని, ఎన్ని కష్టాలు, ఇబ్బందులు ఎదురైనా కూడా ఏనాడు తాను ధర్మాన్ని వీడలేదని అన్నారు. భారతదేశ ఖ్యాతిని ప్రపంచ దేశాలకు చాటి చెప్పగల గొప్ప ఘట్టం శ్రీరామ మందిర నిర్మాణం అని అన్నారు. ఈ శోభాయాత్ర కార్యక్రమంలో గ్రామస్తులు ,మహిళలు, శ్రీరామ భక్తులు, చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రయాణికుల సౌకర్యార్థం సిమెంట్ బల్లలు ఏర్పాటు.

**లయన్స్ క్లబ్ ఆఫ్ నేరేడుచర్ల**

**సూర్యాపేట/నేరేడుచర్ల/జనవరి 01(అక్షరం న్యూస్):-**
లయన్స్ క్లబ్ ఆఫ్ నేరేడుచర్ల ఆధ్వర్యంలో నేరేడుచర్ల పట్టణ ప్రధాన రహదారుల వెంబడి బస్ స్టాప్ లలో ప్రయాణికుల సౌకర్యార్థం సిమెంట్ బల్లలు ఏర్పాటు చేయడం జరిగింది లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్ పర్సన్



బట్టు మధు, క్లబ్ అధ్యక్షుడు జిల్లా ప్రభాకర్ రెడ్డి తో కలిసి ప్రారంభించి మాట్లాడుతూ, పట్టణంలో ప్రధాన రహదారుల విస్తరణ తదుపరి బస్ స్టాప్ లలో బస్సుల కోసం వేచి చూసే ప్రయాణికులు మహిళలు వృద్ధుల ఇబ్బందులను గమనించి లయన్స్ క్లబ్ ఆఫ్ నేరేడుచర్ల ఈ విధమైన సౌకర్యాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు అధ్యక్షుడు చల్ల ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ పట్టణంలో అన్ని పబ్లిక్ ప్రదేశాల్లో ప్రజల సౌకర్యార్థం విరివిగా సిమెంట్ బల్లలు ఏర్పాటు చేసేందుకు క్లబ్బు సన్నద్ధమైందని ఇట్టి సౌకర్యాలను ప్రజల వినియోగించుకోవాలని కోరారు కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి జిలకర రామస్వామి ఉపాధ్యక్షులు కర్రీ సూర్యనారాయణ రెడ్డి, గుండా సత్యనారాయణ మరియు సభ్యులు బాలన సైదులు ఎస్ కె యూసుఫ్ సూరారపు వెంకన్న గౌడ్ చిత్రం విశ్వనాథ్ గంట రంగారెడ్డి పాల్గొన్నారు

## నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్న పరకాల జర్నలిస్టులు.



**హనుమకొండ/ పరకాల/ జనవరి 01,అక్షరం న్యూస్.**
నూతన సంవత్సర వేడుకల్లో పరకాల పట్టణ జర్నలిస్టులు పాల్గొని ప్రెస్ క్లబ్ ఆవరణలో నూతన సంవత్సర కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారిదిగా జర్నలిస్టులు ఉన్నారని అన్నారు. జర్నలిస్టు కుటుంబాలకు ప్రభుత్వం డబుల్ బెడ్ రూములు, సంక్షేమ పథకాలు అందించాలని ఈ సందర్భంగా వారు కోరారు. జర్నలిస్టుల కష్టసుఖాల్లో పరకాల జర్నలిస్టులు అందరం పాలు పంచుకుంటున్నామని అందరం ఐకమత్యంతో ఉండి సంక్షేమం కోసం కృషి చేస్తామని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

## అన్నా.... హ్యాపీ న్యూ ఇయర్.

**ఎమ్మెల్యే విజ్జన్నకు అల్లం వినోద్ రెడ్డి న్యూ ఇయర్ గ్రీటింగ్స్**

**పెద్దపల్లి టౌన్ జనవరి 1 అక్షరం న్యూస్**

పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావును సోమవారం విజ్జన్న యువసేన వ్యవస్థాపకులు, తెలంగాణ రాష్ట్ర చిల్డ్రెన్ ఫిలిం డిస్ట్రిబ్యూటర్ అల్లం వినోద్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే విజ్జన్నకు పుష్పగుచ్చం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మరెన్నో ఉన్నత పదవులను అలంకరించాలని ఆకాంక్షించినట్టు వినోద్ రెడ్డి తెలిపారు.



## ఇంటింటికి అయోధ్య రాముని పవిత్ర అక్షింతలు.

**ఆదర్శ కాలనీలో పంచిన మాజీ ఎమ్మెల్యే మొలుగూరి.**



**హనుమకొండ/ పరకాల/ జనవరి 01,అక్షరం న్యూస్.**
అయోధ్య శ్రీరాముని అక్షింతలు పరకాల పట్టణానికి మేళ తాళాలతో ఊరేగింపుగా శ్రీ కుంకుమేశ్వర ఆలయానికి చేరుకోవడం జరిగింది. వాటిని సోమవారం పరకాల మాజీ ఎమ్మెల్యే మొలుగూరి బిక్షపతి ఆదర్శ కాలనీలో ఇంటింటికి పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మొలుగూరి మాట్లాడుతూ భారత దేశ ఆరాధ్య దైవమైన శ్రీరామ మందిర నిర్మాణ కి కృషి చేసిన భారత ప్రధాని నరేంద్ర మోడీ ఒక పండుగ వాతావరణంలో అక్షింతలు పంపిణీ చేశారని, వాటిని పరకాల ప్రాంత ప్రజల పంచడం ఒక అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ భక్తులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## మమత నగర్ లో అయోధ్య శ్రీరామ అక్షింతల పంపిణీ.



**హనుమకొండ/ పరకాల/ జనవరి 01,అక్షరం న్యూస్.**
పరకాల పట్టణంలోని మమతా నగర్ కాలనీలో అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి గడపగడపకు అయోధ్య శ్రీరామ అక్షింతల వితరణ కార్యక్రమంలో భాగంగా జనవరి 1తారీఖు నుండి 5వ తారీఖు వరకు అయోధ్య శ్రీరామ ప్రాణ ప్రతిష్ట అక్షింతలను అందచేసే నేపథ్యంలో పరకాల పట్టణ హుజురాబాద్ రోడ్డు నందలి రామాలయంలో ఆలయ అర్చకుల సంరక్షణలో ఉంచబడిన శ్రీరామ అక్షింతలను పూజా కార్యక్రమాల అనంతరము మమతా నగర్ కాలనీ వాసుల సమక్షంలో అర్చకులచే పూజలు నిర్వహించి ధర్నా సునీల్ రేవతి దంపతుల ఆధ్వర్యంలో భాజా భజంత్రీలతో జైశ్రీరామ్ అనే నినాదంతో ఊరేగింపుగా అక్షంతలు తీసుకొని వచ్చి మమతా నగర్ కాలనీలో ప్రతి గడపగడపకు వెళ్లి అక్షంతలు, శ్రీ రాముల చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సుర రాజేందర్ సరిత, పిట్ట దేవేందర్ స్వప్న, బొల్లెపల్లి రాజు రాధిక, రవీందర్ రమ, తేలకుంట్ల శివ అపర్ణ, కొసరి వెంకన్న రేణుక, రావుల దేవేందర్ రేణుక, శ్రీనివాసు కళ్యాణి , అజాద్ మాధవి కాలనీవాసులు పలువురు పాల్గొనడం జరిగింది.

## మల్లన్న క్షేత్రానికి పోటెత్తిన భక్త జనం



చేర్యాల, జనవరి 1 : ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామి వారి క్షేత్రం సోమవారం భక్తుల తో కిటకిటలాడింది. స్వామి వారిని దర్శించుకునేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి సుమారు 20వేల మందికి పైగా భక్తులు కొమురవెల్లికి తరలివచ్చినట్లు ఆలయవర్గాలు తెలిపాయి. కొత్త సంవత్సరం మొదటి రోజు కావడంతో సైతం చేర్యాల, సిద్దిపేట, హుస్నాబాద్, గజ్వేల్, జనగామ, బచ్చన్నపేట, కరీంనగర్ తదితరల ప్రాంతాల నుంచి భక్తులు వచ్చారు కాగా, ప్రతి ఏటా మొక్కులు చెల్లించుకునే భక్తులు భక్తులు శనివారం ఉదయం నుంచే మల్లన్న క్షేత్రానికి చేరుకున్నారు. అనంతరం ఆలయ నిర్వహణలో ఉన్న గదులతో పాటు ప్రైవేటుగా ఉన్న గదులు రెంట్‌కు తీసుకుని బస చేశారు. ఆదివారం వేకువజామునే నిద్రలేచి కోనేటిలో పవిత్ర స్నానం అచరించి, నేరుగా స్వామి వారి దర్శనం కోసం క్యూలైన్లలో గంటల పాటు వేచి ఉండి స్వామి వారిని దర్శించుకుని కోరికలు తీర్చాలని వేడుకున్నారు.

## పారిశుద్ధ్య కార్మికులతో కలిసి కేటీఆర్ మధ్యాహ్న భోజనం



హైదరాబాద్ : నూతన సంవత్సర వేడుకలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పారిశుద్ధ్య కార్మికులతో కలిసి జరుపుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ భవన్‌లో కేటీఆర్ పారిశుద్ధ్య కార్మికులతో సమావేశం నిర్వహించారు. వారితో కాసేపు ముచ్చటించిన కేటీఆర్.. అనంతరం కలిసి భోజనం చేశారు. కార్మికులతో సెల్ఫీలు దిగారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పాల్గొన్నారు. ఇక కేటీఆర్‌ను పలువురు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నేతలు, కార్యకర్తలు కలిసి నూతన సంవత్సర శు భాకాంక్షలు తెలిపారు.

## కిక్కిరిసిన ఆలయాలు.. యాదాద్రీశుని దర్శనానికి 3గంటలు



హైదరాబాద్: నూతన సంవత్సరం సందర్భంగా రాష్ట్రంలోని ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోతున్నాయి. యాదగిరిగుట్ట, వేములవాడ, భద్రాచలం, భద్రకాళి టెంపుల్, బాసరతోపాటు హైదరాబాద్‌లోని బిర్లా టెంపుల్, చిలుకూరు బాలాజీ ఆలయం, దిల్‌సుఖ్‌నగర్ సాయిబాబా ఆలయం సహా పలు క్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయానికి తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. దీంతో స్వామివారి దర్శనానికి మూడు గంటల సమయం పడుతున్నది. ప్రత్యేక దర్శనానికి 2 గంటలు పడుతున్నది. ఇక వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. సోమవారం అందునా కొత్త ఏడాది తొలిరోజు కావడంతోపాటు మేడారం జాతరకు ముందుగా రాజన్నను దర్శించుకోవడానికి భక్తులు తరలివస్తున్నారు. దీంతో గర్భగుడిలో ఆర్జిత సేవలను అధికారులు రద్దుచేశారు. గుండంలో స్నానాలు ఆచరించిన భక్తులు.. స్వామివారికి కోడె మొక్కులను చెల్లించుకుంటున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇక వరంగల్‌లోని శ్రీ భద్రకాళి అమ్మవారి ఆలయంలో భక్తుల కోలాహలం నెలకొన్నది. అమ్మవారికి మొక్కులు చెల్లించుకుని ప్రత్యేక పూజలు చేస్తున్నారు.

## కసాయి తండ్రి.. కన్న కూతురిని మంటల్లోకి విసిరేశాడు

### స్వల్ప గాయాలతో బయటపడ్డ చిన్నారి

నస్రుల్లాబాద్, డిసెంబర్ 31 : మండుతున్న గడ్డి వాములోకి ఓ వ్యక్తి తన ఏడేండ్ల కూతురిని విసిరేశాడు. అదృష్టవశాత్తు ఆ చిన్నారి స్వల్పగాయాలతో బయటపడింది. ఈ ఘటన కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండలం బరంగేడ్గి గ్రామంలో ఆదివారం జరిగింది.గ్రామానికి చెందిన దేశాయిపేట్ సాయిలు పెద్ద కుమార్తె అంకిత తన చెల్లితో కలిసి ఆడుకుంటున్నది. అదే గ్రామానికి చెందిన కొట్టాల గంగాధర్‌కు చెందిన గడ్డి వాముకు మంటలు అంటుకున్నాయి. అంకిత తన గడ్డివాముకు నిప్పంటించిందని గంగాధర్ తిడుతుండగా మద్యం మత్తులో ఉన్న సాయిలు కోపంతో తన కుమార్తెను అదే గడ్డివాములోకి విసిరేశాడు. తక్షణమే స్పందించిన గంగాధర్ ఆ చిన్నారిని రక్షించాడు.

## గ్రీన్ ఇండియా ఛాలెంజ్ సంప్రదాయాన్ని కొనసాగిస్తాం: ఎంపీ సంతోష్ కుమార్



హైదరాబాద్ : 'గ్రీన్ ఇండియా ఛాలెంజ్' సంప్రదాయాన్ని నిబద్ధతతో కొనసాగిస్తామని తెలిపారు. రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్ కుమాం అన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా 'గ్రీన్ ఇండియా ఛాలెంజ్' కార్యక్రమంలో పాల్గొని బంజారా హిల్స్ పార్క్‌లో మొక్కలు నాటారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కొత్త సంవత్సరంలో ప్రజలు సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో విలసిల్లాలని ఆకాంక్షించారు. పచ్చదనం, ఆరోగ్యకర వాతావరణం కోసం ప్రతి ఒక్కరూ పుట్టినరోజులతో పాటు వివిధ సందర్భాల్లో మొక్కలు నాటాల్సిన అవసరాన్ని ఆయన గుర్తు చేశారు.మర్రి, రావి, చింత వంటి మొక్కలను నాటడం ద్వారా వేగంగా పెరిగి వివిధ జాతుల పక్షులు, జంతువులకు నీడ, ఆశ్రయం కల్పిస్తాయి. గ్రీన్ ఇండియా ఛాలెంజ్ ప్రారంభం నుంచి ఇప్పటివరకూ ఎన్నో కార్యక్రమాలను చేపట్టి గణనీయమైన అభివృద్ధిని సాధించింది. దేశవ్యాప్తంగా అనేక రంగాల ప్రముఖులు, రాజకీయ నాయకుల నుంచి సాధారణ ప్రజల వరకూ గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో పాల్గొన్నారు. భవిష్యత్ తరాలకు పర్యావరణ అనుకూలమైన, స్థిరమైన వాతావరణాన్ని సృష్టించడం గ్రీన్ ఇండియా ఛాలెంజ్ లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ ఇండియా ఛాలెంజ్ సహ వ్యవస్థాపకులు కరుణాకర్, రాఘవ ఇతర సభ్యులు పాల్గొన్నారు.

# ప్రారంభమైన నుమాయిష్..

**హైదరాబాద్‌లో ఫిబ్రవరి 15 వరకు ట్రాఫిక్ ఆంక్షలు**

**అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనను ప్రారంభించనున్న సీఎం**

**46 రోజుల పాటు కొనసాగనున్న ఎగ్జిబిషన్**

అబిడ్స్, : నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో నిర్వహించే అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన సోమవారం నుంచి ప్రారంభం కానుంది. జనవరి 1న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు, మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి ప్రారంభిస్తారు. స్వాతంత్ర్యానికి పూర్వం నుంచి కొనసాగుతూ వస్తున్న ఈ అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన ప్రతి సంవత్సరం జనవరి 1వ తేది నుంచి ఫిబ్రవరి 15వ తేది వరకు 46 రోజుల పాటు కొనసాగుతుంది.ఈ యేడాది సోమవారం ప్రారంభించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ఎగ్జిబిషన్ సొసైటీ చేపట్టింది. దాదాపు 2400 స్టాళ్లను ఏర్పాటు చేయ నుండగా అమ్యూజ్‌మెంట్ పార్క్, ఫుడ్ కోర్టులు, వివిధ పారిశ్రామికవేత్తల ఉత్పత్తి అమ్మకాలు చేపట్టేందుకు స్టాళ్లను ఏర్పాటు చేస్తారు. నుమాయిష్‌కు వచ్చే సందర్శ కులకు ఇబ్బందులు లేకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లను చేపడుతున్నారు. పోలీస్, అగ్ని మాపక శాఖ అప్రమత్తంగా ఉండి నుమాయిష్ విజయవంతం అయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడపడంతో పాటు మెట్రో రైలు వేళలను పొడిగించనున్నారు.

**ట్రాఫిక్ ఆంక్షలు**

నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో 83వ ఆల్ ఇండియా ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ ప్రారంభమవుతుందని, ఈ నేపథ్యంలో నేటి నుంచి ఫిబ్రవరి 15వ తేదీ వరకు ప్రతి రోజు సాయంత్రం 4 గంటల నుంచి అర్ధరాత్రి వరకు పరిసరాలలో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు నగర పోలీస్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

ట్రాఫిక్ మళ్లింపుసిద్దంబర్‌బజార్ వైపు నుంచి నాంపల్లి వైపునకు వెళ్లే ఆర్టీసీ జిల్లా బస్సులు, ప్రైవేట్ బస్సులు, ఇతర భారీ వాహనాలను మొహింజామార్కెట్ వద్ద అబిడ్స్ వైపు మళ్లిస్తారు.



బషీర్‌బాగ్, కంట్రోల్ రూం వైపు నుంచి నాంపల్లికి వచ్చే వాహనాలను ఏఆర్ పెట్రోల్ బంక్ వద్ద బీజేఆర్ విగ్రహం, అబిడ్స్ వైపు మళ్లిస్తారు.

బేగంబజార్, ఛత్రి నుంచి మలాకుంట వైపు వెళ్లే వాహనాలను అలస్క జంక్షన్ వద్ద దారుసలాం, ఏక్‌మినార్ వైపు మళ్లిస్తారు.

దారుసలాం నుంచి అఫ్జల్‌గంజ్ వైపు వెళ్లే వాహనాలను అలస్క జంక్షన్ నుంచి బేగంబజార్, సిటీ కాలేజ్ వైపు మళ్లిస్తారు.

మూసాబౌలి, బహుదూర్‌పురా వైపు నుంచి నాంపల్లికి వెళ్లే వాహనాలను సిటీ కాలేజీ వద్ద నయాపూల్, ఎంజేమార్కెట్ రూట్‌లో మళ్లిస్తారు.

# అయోధ్య రాముడికి హైదరాబాద్ పాదుకలు

**రాబాద్ పాదుకలు విమానంలో అయోధ్యకు తరలింపు**

**రామచంద్రుడిపై అనన్య భక్తిని చాటుకున్న అయోధ్య భాగ్యనగర సీతారామ ఫౌండేషన్**

**ఇప్పటికే ఒక జతను పాదయాత్రగా తీసుకెళుతున్న రామ భక్తులు**

**1.03 కోట్లతో రెండు జతలు తయారు చేయించిన భక్తుడు చల్లా శ్రీనివాస్ శాస్త్రి**

**రూపొందించిన శిల్పి రామలింగాచారి..**

**అయోధ్యలో అన్నదానానికీ ఏర్పాట్లు**

హైదరాబాద్ జనవరి 1 :

త్వరలో కొలువుదీరనున్న అయోధ్య రాముడికి మన హైదరాబాద్ నగరం అపురూపమైన కానుకలు అందిస్తున్నది. రామ మందిరం భక్తులను విశేషంగా ఆకట్టుకొనేలా చేయడంలో మన శిల్పులు తమ వంతు కృషి చేస్తున్నారు. ఇప్పటికే అయోధ్య రామాలయానికి 118 దర్వాజలు హైదరాబాద్ బోయిన్‌పల్లిలోని అనురాధ టింబర్ డిపోలో రూపుదిద్దుకొంటుండగా.. ఆ నీలమేఘశ్యాముడికి రెండు జతల బంగారు పాదుకలు కూడా అందబోతున్నాయి. సీతారామ చంద్రుడికి సుమారు రూ.1.03 కోట్ల విలువైన బంగారం పాదుకలను నగరానికి చెందిన అయోధ్య భాగ్యనగర సీతారామ ఫౌండేషన్ అందిస్తున్నది. ఇప్పటికే ఒక జత పాదుకలను భక్తులు పాదయాత్రగా తీసుకెళ్తున్నారు. మరో జత నేడు(సోమవారం) ఉదయం విమానంలో బయలుదేరబోతున్నాయని ఫౌండేషన్ డైరెక్టర్ చల్లా శ్రీనివాస్ శాస్త్రి తెలిపారు. వెండిపైన బంగారు తాపడంతో 13 కేజీల బరువుతో రూపొందించిన ఈ రెండో జత పాదుకలను పాత బోయిన్‌పల్లిలోని హస్మత్‌పేటలో ఉన్న శ్రీశ్రీశ్రీ మద్విరాట్ కళాకుటీర్‌లో తయారు చేశారు. 25 రోజుల పాటు శ్రమించి శిల్పులు వీటిని ఎంతో వైవిధ్యంగా రూపొందించారు. ఈ నెల 10–15 మధ్యలో ఈ రెండు జతల పాదుకలను ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆధిత్యనాథ్‌కు అందివ్వనున్నారు.

అన్ని పుణ్యక్షేత్రాలు తిరుగుతూ..

ఫౌండేషన్ సాయంతో నగరానికి చెందిన రామ భక్తుడు చల్లా శ్రీనివాస్ శాస్త్రి ఈ పాదుకలను తయారు చేయించారు. ముందు తయారీ పూర్తైన మొదటి జత పాదుకలకు అతను దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన అన్ని పుణ్యక్షేత్రాల్లో పూజలు జరిపించారు. అక్టోబర్ 28న కాకినాడలోని వెదరుపాకం నుంచి ఆ పాదుకలతో పాదయాత్రగా బయలుదేరారు. అలా దేశవ్యాప్తంగా భక్తులకు దర్శనార్థంగా ఉంచారు. రామేశ్వరం, శృంగేరి, కంచి, తిరుమల, శ్రీరంగ, సింహాచలం, విజయవాడ సహా అనేక పుణ్యక్షేత్రాలు, మఠాల్లో ఆ పాదుకలు పూజలు అందుకున్నాయి. రాముడు ఎలాగైతే పాదయాత్రగా అరణ్య వాసం నుంచి తిరిగి అయోధ్యకు బయలుదేరాడో అదేవిధంగా ఈ పాదుకలను చేర్చబోతుండటం విశేషం. కాగా,



రామమందిర ప్రారంభోత్సవానికి అయోధ్యలో ఘనంగా ఏర్పాటు సాగుతున్నాయి. గర్భగుడిలో ప్రతిష్ఠించబోయే బాలరాముడి విగ్రహాన్ని ఇప్పటికే ఎంపి చేసినట్టు సమాచారం. జనవరి 22న విగ్రహాన్ని ప్రతిష్ఠించన్నారు. వారం పాటు ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాలు జరుగనున్నాయి.

నా జీవితానికి సార్థకత లభించింది

నేను సినిమాల్లో సౌండ్ ఇంజినీర్‌గా పనిచేశాను. రాముడికి సేవ చేయడంలోనే నాకు నిజమైన సంతృప్తి దొరికింది. రామ మందిర నిర్మాణం ప్రారంభం నుంచే నేను నా పూర్తి సమయం రాముడికే అంకితమిచ్చాను. నేను అయోధ్యలో రాముడి దర్శనానికి వచ్చే భక్తుల కోసం మందిరానికి కిలోమీటర్ దూరంలో ఉచితంగా సుమారు 10 వేల మందికి అన్నదానం అందించేలా కూడా ఏర్పాట్లు చేస్తున్నాను. మన తెలంగాణ వంటకాలు అక్కడ ఉంటాయి. భక్తులు ఎవరైనా నా నంబర్ 9550754389కు ఫోన్ చేసి సంప్రదించొచ్చు.

ప్రత్యేక ఆకర్షణగా రూపొందించాం

మొదటి జత పాదుకల తయారీకి వారం రోజుల సమయం తీసుకున్నాం. రెండో జత పాదుకలకు 25 రోజుల సమయం పట్టింది. పాదుకలలో శంఖు చక్రాలు, సూర్య చంద్రులు, ధనస్సు, ఏనుగు, ఆవు, పద్మం, అంకుశం ఇతరత్రా ఉంటాయి. పన్నెండున్నర ఇంచులు పొడవు, ఐదున్నర ఇంచుల వెడల్పుతో పాదుకలు ప్రత్యేక ఆకర్షణగా తయారు చేశాం. అయోధ్యకు హైదరాబాద్ నుంచి రామ పాదాలు తయారు చేసి పంపించడం అదృష్టంగా భావిస్తున్నా.

# 2023 రిజల్యూషన్స్ పరిస్థితేంటీ..?

## కొత్త సంవత్సరంలోనైనా ఇలా తేలిగ్గా లక్ష్యం చేరండి..!



హైదరాబాద్,జనవరి1

స్మోకింగ్‌కు దూరం, మందుకు రామ్‌రామ్, వాకింగ్‌కు జై, డైటింగ్‌కు సై.. పక్షం రోజుల క్రితం పార్టీ చేసుకుంటూ తీసుకున్న తీర్మానాల సంగతేమిటి? ఓ అంచనా ప్రకారం.. ఇరవై ఐదు శాతం మంది జనవరి చివరి వరకు మాత్రమే కొత్త సంవత్సర తీర్మానానికి కట్టుబడి ఉంటారు. తొలివారంలోనే చేతులెత్తేసేవారు నలభై ఎనిమిది శాతం. ఒక్కోనెల గడిచేకొద్దీ.. ఎంతో కొంతమంది అస్త్ర సన్యాసం చేస్తారు. డిసెంబరు వరకూ అంతే ఉత్సాహంగా, అదే పట్టుదలతో కట్టుబడి ఉండేవారు ఎనిమిది శాతమే. ఆ కొద్దిమందిలో మీరూ ఉండాలనుకుంటే కొన్ని జాగ్రత్తలు తప్పనిసరి..పెద్ద లక్ష్యాలను చిన్నగా విభజించుకోండి. ఏడాదిలో పది కేజీల బరువు తగ్గాలన్న తీర్మానం మంచిదే. కానీ, దాన్ని పది ముక్కలు చేసుకుని.. నెలకు ఒక కేజీ తగ్గినా చాలని అనుకుంటే.. తేలిక అవుతుంది. ఒక నెల కుదరకపోయినా, ఇంకోనెల సాధిస్తాం. ఏడాది చివరికి ఏడెనిమిది కిలోలు వదిలించుకోవడం ఖాయం.

కోటీశ్వరుడు కావాలనే కోరిక కాదనలేనిదే. కానీ, వంద లక్షలు పోగైతేనే కోటి అవుతుంది. కాబట్టి, నెలనెలా ఎంత పొదుపు–మదుపు చేయాలనే విషయంలో స్పష్టత పెంచుకోండి. గాలిమేడలు వద్దు.

సిగరెట్ మానేయాలన్న నిర్ణయానికి అభినందనలు. ఆ ప్రయత్నంలో చిన్నచిన్న వైఫల్యాలు ఎదురైనా పట్టించుకోకండి. ఉదాహరణకు కొంతమంది.. స్నేహితుల బలవంతంతోనో, వ్యసనం తాలూకు బలహీనత కారణంగానో.. సిగరెట్ ముట్టిస్తారు. ఎలాగూ మళ్లీ మొదలుపెట్టాం కదా అని.. పాత అలవాటే కొనసాగిస్తారు. ఇది తప్పు. ఆ అనుభవాన్ని పాఠంలా మాత్రమే తీసుకోవాలి. పట్టుదలతో ముందుకెళ్లాలి.

మనసు చాలా శక్తిమంతమైంది. ఆ శక్తిని పాజిటివ్ ఎనర్జీగా మార్చుకోండి. మీ సంకల్పబలాన్ని పెంచుకోండి. ఆ ప్రయత్నంలో ధ్యానం ఎంతో ఉపయోగపడుతుంది. రోజూ ఓ పది నిమిషాలు మీ ఆలోచనలను గమనిస్తూ కూర్చోవడమే ధ్యానం. దీనివల్ల మీరు వేరు, మీ ఆలోచనలు వేరు అన్న ఎరుక సాధ్యం అవుతుంది. తీర్మానానికి కట్టుబడి ఉండాలన్న పట్టుదల పెరుగుతుంది.పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలనుకోవడం మంచి తీర్మానమే. అంతలోనే, 'నాకు సమయం లేదు', 'పుస్తకం చదివితే కంటికి శ్రమ', 'పుస్తకాల రేట్లు బాగా పెరిగిపోయాయి', 'అయినా చదవదగిన పుస్తకాలు ఎక్కడొస్తున్నాయి?'.. తరహా సాకులతో ఓ మంచి అలవాటును మూలనపడేయకండి. ఏ వాకింగ్‌లోనో ఆడియో బుక్స్ వినండి. ధర ఎక్కువనిపిస్తే సెకండ్స్‌లో ప్రయత్నించండి. కొత్త పుస్తకాలలో సరుకు లేదనిపిస్తే.. క్లాసిక్స్ ఎంచుకోండి. మనసుంటే మార్గం ఉంటుంది.కొన్ని సందర్భాల్లో ఎవరో ఒకరి మద్దతు అవసరం అవుతుంది. నిపుణుల సలహా తప్పనిసరి కావచ్చు. బరువు తగ్గే విషయంలో డైటీషియన్ అభిప్రాయం తీసుకోండి. వ్యసనాలు వదలకపోతే మానసిక నిపుణులను సలహా అడగండి. తీర్మానం అమలులో ఏవైనా ఆరోగ్య సమస్యలు ఎదురైనప్పుడు.. ఫ్యామిలీ డాక్టర్‌తో మాట్లాడండిస్నేహితులు, బంధువులు, కొలీగ్స్‌లో మీలాంటి తీర్మానమే తీసుకున్న వాళ్లు కొందరైనా ఉంటారు. అంతా కలిసి ఓ వాట్సాప్ గ్రూప్ ప్రారంభించండి. లక్ష్యాలు, గెలుపులు, సవాళ్లు ..మనసులోని భావాలన్నీ పంచుకోండి.

చివరగా ఒక మాట. మీ పరిధిలోలేని విషయాల జోలికి వెళ్లకండి. ఫలానా అమ్మాయిని ప్రేమించాలనో, పెండ్లి చేసుకోవాలనో తీర్మానిస్తే మూర?త్వమే అవుతుంది. మీ తీర్మానం మరొకరి జీవితాన్ని ప్రభావితం చేయలేదు.



# నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్న పరకాల ఎమ్మెల్యే రేవూరి





హనుమకొండ జిల్లా / పరకాల నియోజకవర్గం / ఆత్మకూరు మండలం / అక్షరం న్యూస్:ఆత్మకూర్ మండల కేంద్రంలోని గ్జమ్ జి.జే.యం. పెంతేకొస్తు ప్రార్థన మందిరంలో ఘనంగా నూతన సంవత్సర వేడుకలో పాల్గొన్న పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి, మాజీ పార్లమెంట్ సభ్యులు సిరిసిల్ల రాజయ్య.

ఆత్మకూరు మండల కేంద్రంలోని జి. జే. యం. పెంతేకొస్తు ప్రార్థనా మందిరంలో జరిగిన నూతన సంవత్సర వేడుకలలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాజీ పార్లమెంట్ సభ్యులు సిరిసిల్ల రాజయ్య పాల్గొన్నారు.అనంతరము చిన్నపిల్లలు పాస్టర్స్ తో కలిసి వారు కేక్ కట్ చేశారు. నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు మార్పు కావాలని కోరుకొని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానికి అధికారం ఇచ్చారని పరకాల నియోజకవర్గంలో నాపై నమ్మకంతో నన్ను శాసనసభ్యులుగా గెలిపించారని అన్నారు. మీ నమ్మకాన్ని వమ్ము చేయకుండా అన్ని వర్గాల ప్రజలందరికీ అండగా ఉంటానని హామీ ఇచ్చాడు.

ప్రజల భాగస్వామ్యం ప్రభుత్వ సహకారంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్రములో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం లోని రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా పాలన చేస్తుందని మీ అందరి ఆశీస్సులు ఈ ప్రభుత్వానికి మెండుగా ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా అయ్యప్ప స్వామి పడిపూజ మహోత్సవం





**భజన సంకీర్తనలతో మారుమోగిన కేశవపట్నం.**

శంకరపట్నం/కరీంనగర్/జనవరి 1(అక్షరం న్యూస్ ) మండలంలోని కేశవపట్నం గ్రామంలోని ప్రముఖ వ్యాపారవేత్త,మండల రైస్ మిల్లుల సంఘం అధ్యక్షుడు తనుకు ప్రభాకర్- నాగమణి పెళ్లిరోజు సందర్భంగా గణేష్ రైస్ మిల్లు ఎదుట అయ్యప్ప స్వామి మహా పడి పూజ ను గురు స్వాములు,వేద పండితుడు సుమన్ శాస్త్రి,శివరామకృష్ణ భజన మండలి ఆధ్వర్యంలో భక్తి పాటలతో ఎంతో ఘనంగా నిర్వహించారు.ఈ అయ్యప్ప స్వామి పడిపూజ మహోత్సవానికి అనేకమంది భక్తులు,దంపతులు,ప్రముఖ వ్యాపారవేతలు వచ్చి స్వామివారిని దర్శించుకొని పులకించి పోయారు.పడిపూజ మహోత్సవంలో స్వామివారికి రంగురంగుల పూల తో అలంకరించడంతో అయ్యప్ప స్వామి భక్తులు దర్శనం ఇచ్చారు.సుమారుగా నాలుగు గంటలకు పైగా అయ్యప్ప స్వామి మహోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించడంతో హాజరైన అయ్యప్ప స్వామిని దర్శించుకొని టెంకాయలు కొట్టి మొక్కులు అప్పజెప్పారు. అనంతరం మాలదారులకు తణుకు ప్రభాకర్-నాగమణి అన్నదాన కార్యక్రమం చేపట్టారు.ఈ కార్యక్రమంలో తనుకు ప్రభాకర్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.గురు స్వామి గాజుల శ్రీనివాస్,చింతం సత్యనారాయణ, మర్యాల శ్రీనివాస్,మర్యాల చంద్రగుప్త,మాతంగి శ్రీనివాస్, మాజీ జెడ్పిటిసి బత్తిని శ్రీనివాస్ గౌడ్,మాజీ సర్పంచ్ దొంగల రాములు,తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్,గుర్రం శ్రీకాంత్ గౌడ్ అయ్యప్ప స్వామి భక్తులు,వివిధ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి పొంగులేటి ని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్, ఐఎన్.టీ.యూసి నేతలు

**రాజ మహమ్మద్ జాన్ బీ ట్రస్ట్ సభ్యులను ,ఎం.డి.రజాక్ ను అభినందించిన మంత్రి పొంగులేటి**



ఖమ్మం జిల్లా/ జనవరి.01 /అక్షరం న్యూస్‌బీ

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని రాష్ట్రా రెవెన్యూ , గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ని కొత్తగూడెం కాంగ్రెస్ మరియు ఐఎన్.టీ.యూసి నేతలు ఆళ్ళ మురళి, తూము చౌదరి, నాగేంద్ర త్రివేది, నాగ సీతారాములు, కొత్తగూడెం ఏరియా ఐఎన్. టీయూ.సి నాయకులు ఎం.డీ రజాక్, గోపు కుమార్, చిలక రాజయ్య, చెరిపెల్లి. నాగరాజు, విప్లవ రెడ్డిభీముడు, గౌస్, సత్తార్, సి.హెచ్. కుమార్, నటరాజు, వెజ్జలా శ్రీనివాస్, కొమరయ్య, బాను కమల్, చిరంజీవి, శంకర్ బాబు, రమాకాంత్, వినయ్, నాగేశ్వరావు, నాగుల శంకర్, కృష్ణ, పోశం శ్రీను, భరత్, రాజశేఖర్, గౌస్, మోహన్ రెడ్డి, అనూక్ రాజ్, రాందాని పరుశురాం రమేష్, క్రాంతి,నర్సింహా రావు ఖమ్మం మంత్రి క్యాపు కార్యాలయంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

**రాజ మహమ్మద్ జాన్ బీ స్వచ్ఛంద సేవా సంస్థ నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరించిన మంత్రి పొంగులేటి**



సింగరేణి కార్మిక నేత మరియు ఐఎన్.టీ.యూసి నాయకులు ఎం.డి.రజాక్ తన తల్లి పేరుపై ఏర్పాటు చేసిన రాజ మహమ్మద్ జాన్ బీ స్వచ్ఛంద సేవా సంస్థ నూతన సంవత్సర క్యాలెండర్ ను మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రజాక్ కుటుంబ సభ్యులందరి సహకారంతో ఏర్పాటైన ట్రస్ట్ ఆధ్వర్యంలో మొట్ట మొదటిసారి రుద్రంపూర్ గ్రామంలో ఫ్రీజర్ బాక్స్ ఫ్రీ సర్వీస్ తో పాటు, చుట్టుపక్కల గ్రామాల్లో ఉన్న గవర్న మెంట్ స్కూల్స్ నందు మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడం, పేద కుటుంబాలకు నిత్యవసరాలు పంపిణీ చేయడం, హెల్త్ అండ్ స్పోర్ట్స్ కు సంబంధించి ఎన్నో కార్యక్రమాలు ఏర్పాటు చేయడం మంచి పరిణామంగా భావిస్తున్నామన్నారు. ఈ ట్రస్ట్ ద్వారా మరెన్నో సేవా కార్యక్రమాలు చేయాలని ఆకాంక్షిస్తూ, ఆ దేవుడి దయ తో అందరూ మంచిగా ఉండాలని ట్రస్ట్ సభ్యులను అభినందించారు.

## కొత్తగూడెం ఏంఎల్ఏ కూనంనేనికి శుభాకాంక్షలు తెలిపిన సబ్ డివిజన్ పోలీస్ అధికారులు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా / కొత్తగూడెం టౌన్ / జనవరి 1 / అక్షరం క్రైమ్ న్యూస్

కొత్తగూడెం సబ్ డివిజన్ పోలీస్ అధికారి షేక్ అబ్దుల్ రహమాన్ మరియు ఇతర పోలీసు ఆఫీసర్స్ సోమవారం కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు, నూతన సంవత్సర కేకును కట్ చేయించారు. సీపీఐ జిల్లా కార్యాలయంతో పాటు కూనంనేని గృహంలో ఆయన్ను కలిసి పుష్పగుచ్చాలను అందించి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్బంగా కూనంనేని మాట్లాడుతూ నియోజకవర్గములో శాంతి భద్రతలను కాపాడే విషయంలో కఠినంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు, పోలీసు శాఖకు పూర్తి సహకారం అందిస్తామని, సమస్యలేమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. కూనంనేని వెంట సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, ఇతర పోలీసు అధికారులు వున్నారు.

## నేటి నుంచి యదా విధిగా ప్రజాపాలన గ్రామసభలు



**ప్రజాపాలనలో వచ్చే దరఖాస్తులను నిశిత పరిశీలన చేయాలి జిల్లా కలెక్టర్ : డా.ప్రియాంక అల**

భద్రాద్రి జిల్లా/ కొత్తగూడెం/ జనవరి.01/ అక్షరం టౌన్ న్యూస్‌బీ జనవరి 2వ తేదీ నుంచి 6వ తేదీ వరకు యథావిధిగా ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించి ప్రజల నుండి ప్రభుత్వం నిర్దేశించిన ఆరు గ్యారంటీల దరఖాస్తులు స్వీకరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల అధికారులను ఆదేశించారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, మండల ప్రత్యేక అధికారులు ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుంచి 6 గంటల వరకు ప్రజల నుండి ప్రభుత్వం నిర్దేశించిన పథకాల యొక్క దరఖాస్తుల స్వీకరించాలని ఆమె సూచించారు. దరఖాస్తుల స్వీకరణకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని చెప్పారు. స్వీకరించిన ప్రతి దరఖాస్తుకు రసీదు ఇవ్వడంతో పాటు ప్రత్యేకంగా రిజిస్టర్లో నమోదులు చేయాలని కలెక్టర్ చెప్పారు. నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం గ్రామ పంచాయతి, మున్సిపాలిటీలలో గ్రామ సభలు నిర్వహించాలని చెప్పారు. రెండు రోజులు ప్రభుత్వ సెలవులు తదుపరి గ్రామ సభలు నిర్వహిస్తున్నందున దరఖాస్తు చేయడానికి ప్రజలు అధికసంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నదని, మహిళలకు, వయోవృద్దులకు,

దివ్యాంగులకు ప్రత్యేక లైన్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. దరఖాస్తులు పూరించుటకు హెల్ప్ డెస్క్ లు, నియమించిన ఇతర ప్రభుత్వ సిబ్బంది ప్రజలకు తగు సూచనలు సలహాలు ఇవ్వాలని చెప్పారు. దరఖాస్తు నిశిత పరిశీలన చేయాలని పూరించని ఖాళీలుంటే సమగ్ర సమాచారం తెలుసుకుని పూరించాలని కలెక్టర్ సూచించారు.

## డబ్బుల వ్యవహారంలో పవర్ హౌస్ కాలనీలో హత్య. హత్య వ్యవహారంపై విచారణ చేపట్టిన వన్ టౌన్ సీఐ



గోదావరిఖని ప్రతినిధి/పెద్దపల్లి/ జనవరి 1/అక్షరం న్యూస్:

కడార్ల నరేందర్ మార్కండేయ కాలనీ గోదావరిఖని అను అతని వద్దకు11 నెలల కిందట నేరస్తుడు చోడ రవితేజ,అతని భార్య సునీత లు వచ్చి మేషను పనిచేసుకుంటున్నారు.తన ఇల్లు పవర్ హౌస్ కాలనీ గోదావరిఖని నందు గలది కిరాయికి ఇవ్వమని అడగగా ఫిర్యాది నరేందర్ వారికి తన రేకుల షెడ్డు కిరాయికి ఇచ్చినాడు.గత మూడు నెలల కిందట మృతుడు వంచర్ల గంగాధర్ రావు అనునతడు వచ్చి నేరస్తుడు చోడ రవితేజ దగ్గర మేషన్ పని చేస్తున్నాడు తేదీ 31/12/2023 రోజున రాత్రి నేరస్తుడు చోడ రవితేజ మృతుడు వంచర్ల గంగాధర్ రావులు ఇద్దరు ప్రతిరోజు గొడవపడుతుంటారని డబ్బుల విషయంలో రోజు తిట్టుకుంటారని అట్టి విషయంపైనే ఇరువురి మధ్య గొడవ జరగగా నేరస్తుడు చోడ రవితేజప్రతిసారి తనను డబ్బులు అడుగుతున్నాడని కోపంతో మృతుడు వంచర్ల గంగాధర్ రావును చంపాలనే ఉద్దేశంతో బలమైన ఆయుధంతో తల వెనుక భాగమున కొట్టగా తీవ్ర రక్త గాయం అయి రాత్రి 11 గంటల ప్రాంతంలో చనిపోయాడు అని కడార్ల నరేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించినట్లు గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎస్ ప్రమోదరావు తెలిపారు.

## డేవిస్ కార్నర్ రెస్టారెంట్ ను ప్రారంభించిన పశ్చిమ ఎమ్మెల్యే నాయిని...



హనుమకొండ జిల్లా/ పశ్చిమ నియోజకవర్గం / అక్షర న్యూస్ :హనుమకొండ లోని కేయూ జంక్షన్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన దేవీస్ కార్నర్ రెస్టారెంట్ ను వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రారంభించాడు.ఈ కార్యక్రమంలో టిపీసిసి కార్యదర్శి తౌటమ్ రవీందర్, వరంగల్ పశ్చిమ ఓబీసీ డిపార్ట్మెంట్ వైస్ ఛైర్మన్ నల్ల సత్యానారాయణ తదితరులు పాల్గొన్నారు.


# మానసిక దివ్యాంగులతో 2024 స్వాగత సంబరాలు- డాక్టర్ అనితా రెడ్డి



హన్మకొండ జిల్లా /సర్క్యూట్ హౌజ్ /అక్షరం న్యూస్ :

అనురాగ్ హెల్పింగ్ సొసైటీ ప్రెసిడెంట్ డాక్టర్ అనితా రెడ్డి అధ్యక్షతన హన్మకొండ లోని స్పందన మానసిక దివ్యాంగుల ఆశ్రయం లో నిర్వహించిన 2024 స్వాగతం కార్యక్రమం లో డాక్టర్ అనితా,పిల్లల మధ్య ఆనందం గా కేక్ ను కట్ చేసి సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ రాబోయే కొత్త సంవత్సరం లో అందరూ అనుకున్నవన్నీ జరిగి ప్రతి రోజూ సంతోషంగా గడపాలని , కల్మషము ఎరుగని ఈ పిల్లల జీవితం ఆనందంగా సాగాలని ఆకాంక్షిచారు, నూతన సంవత్సర వేడుకలు ఈ పిల్లల మధ్య జరుపుకోవడం సంతోషంగా ఉందని, పది మందిని సంతోష పెట్టి నప్పుడే మనస్సుకు తృప్తి అని అన్నారు, పిల్లలు పాటలు పాడి డాన్సులు చేసి అలరించారు, తన సహకారం సంస్థ కు ఎప్పడికి ఉంటుందని ,అందరిని గౌరవిద్దాం, అందరిని ప్రేమిద్దాం, మంచిని, ప్రపంచశాంతిని కోరుకుందాం! అని డాక్టర్ అనితా రెడ్డి అన్నారు, అనంతరం పండ్లు, స్వీట్లు అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు, ఈ కార్యక్రమంలో డాక్టర్ అనితా రెడ్డి, సుచరిత, వసుధ, తదితరులు పాల్గొన్నారు

## యువకుడి అనుమానాస్పద మృతి....



గోదావరిఖని ప్రతినిధి/పెద్దపల్లి/జనవరి 1/అక్షరం న్యూస్:

పులిపాక రాజేందర్ తండ్రి సాయి మల్లయ్య,36 సంవత్సరాలు,రొంపి కుంట,గ్రామం కమాన్పూర్ మండల నివాసుడు తేదీ 31 12 2023 రోజున తన అత్త ఇల్లైన దానిలోని ఇందిరానగర్ కు రాగా మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో ఇంట్లో నుండి బయటకు వెళ్లి రామాంజనేయ బార్ కు దగ్గరలో గల మోటార్ సైకిల్ మీద కూర్చుని అలాగే చనిపోయి ఉన్నాడు అని మృతుని మరణంలో అనుమానం కలదు అని మృతుడు గుండెపోటుతో లేదా మరే ఇతర కారణం తో అని చనిపోయాడని అనుమానం కలదు అని శవ పరీక్ష నిర్వహించి సరియగు మరన కారణం తెలుసుకోగలరు అని మృతుని అన్న అయినా పులిపాక సతీష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించినట్లు గోదావరిఖని వన్ టౌన్ ఎస్ఐ బి సమ్మయ్య తెలిపారు.

## మంత్రి పొంగులేటి కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన డీసీఎంఎస్ వైస్ : చైర్మన్ కొత్వాల



ఖమ్మం జిల్లా/ జనవరి.01 /అక్షరం న్యూస్

తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ,సమాచార శాఖల మంత్రి పొంగులేటి ని ఖమ్మం లో మర్యాద పూర్వకంగా కలుసుకున్న డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు మంత్రి పొంగులేటి కి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట పాల్వంచ మాజీ జడ్పిటిసి సభ్యులు ఎర్రంశెట్టి ముత్తయ్య, సీనియర్ అడ్వకేట్ పిట్టల రామారావు, పాత పాల్వంచ చారి, ధర్మచౌత్ ఉపేందర్ తదితరులు ఉన్నారు.

## మాజీ మంత్రి సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ కు మొక్కనిచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన కోలేటి



గోదావరిఖని ప్రతినిధి/పెద్దపల్లి/జనవరి 1/అక్షరం న్యూస్:

తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ టిఆర్ఎస్ సీనియర్ నాయకుడు కోలేటి దామోదర్ సోమవారం హైదరాబాద్ లోని తెలంగాణ భవన్ లో మాజీ మంత్రి, సిరిసిల్ల శాసనసభ్యులు కే.తారకరామారావు కి మొక్కను ఇచ్చి,నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలిపారు. కేటీఆర్ కు అత్యంత సన్నితుడు కోలేటి దామోదర్ మర్యాదపూర్వకంగా కలిసి మొక్కనిచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి ఆయనతో కాసేపు మాట్లాడారు.

# కొత్తగూడెం నియోజకవర్గం అభివృద్ధిలో పాలుపంచుకొంటా డీసీఎంఎస్ వైస్ చైర్మన్ : కొత్వాల





### నూతన సంవత్సరం సందర్భంగా కొత్వాలకు శుభాకాంక్షలు తెలిపిన పట్టణ ప్రముఖులు

భద్రాద్రి జిల్లా /పాల్వంచ/ జనవరి.01/ అక్షరం న్యూస్

కొత్తగూడెం నియోజకవర్గం అభివృధికై తన వంతుగా కృషి చేస్తానని, ప్రభుత్వం ద్వారా చేపట్టే అభివృద్ధి కార్యక్రమాల్లో పాలుపంచుకుంటానని డీసీఎంఎస్ వైస్ చైర్మన్, జిల్లా కాంగ్రెస్ నాయకులు కొత్వాల శ్రీనివాసరావు స్పష్టం చేశారు. నూతన సంవత్సరం సందర్భంగా పాత పాల్వంచలో కొత్వాల స్వగృహంలో సందడి వాతావరణం నెలకొంది. నియోజకవర్గంలోని పలువురు ప్రముఖులు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, స్థానిక ప్రజలు కొత్వాల స్వగృహానికి చేరుకుని కొత్వాలకు శుభాకాంక్షలు తెలిపారు. కేక్ లు కట్ చేసి, స్వీట్లు పంచిపెట్టి, బాణాసంచా కాల్చారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమబాటలో పరిపాలన సాగిస్తున్నదని, అందరూ ప్రభుత్వానికి సహకరించాలన్నారు. నియోజకవర్గంలోని ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో వుంటూ వారి సమస్యల పరిష్కారానికై కృషిచేస్తానని కొత్వాల పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, నియోజకవర్గ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.





# టిఆర్.వీకే.ఎస్ కార్యాలయంలో ఘనంగా నూతన సంవత్సర వేడుకలు








నూతన సంవత్సరం వేడుకలను పాల్వంచ కెటిపిఎస్ కాలనీలోని టిఆర్.వీకే. ఎస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్, జెన్కో కార్యదర్శి చారుగుండ్ల రమేష్ ఉద్యోగుల ఆధ్వర్యంలో నూతన సంవత్సర కేక్ ను కోసి నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. అనంతరం జనవరి 01న జన్మదినం జరుపుకుంటున్న కే.అంజన్ రాజు, కే. రవికుమార్ యాదవ్ చే కేక్ కట్ చేయించారు. కార్యక్రమం రమేష్ ఆధ్వర్యంలో కేటీపీఎస్ 7వ దశ చీఫ్ ఇంజనీర్ పి.వెంకటేశ్వరరావు, కెటిపిఎస్ 5,6 దశల చీఫ్ ఇంజనీర్ ఎం. ప్రభాకర్ రావు , ట్రయినింగ్ ఇనిస్ట్యూట్ చీఫ్ ఇంజనీర్ కె. శ్రీనివాస బాబు ,సూపరింటెండెంట్ ఇంజనీర్స్ , డివిజనల్ ఇంజనీర్స్ ,సహచర కార్మిక సంఘ నాయకులను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఆర్.వికె.ఎస్ రాష్ట్ర నాయకులు ,జెన్కో నాయకులు ,రెండు రీజినల్ నాయకులు ,బ్రాంచ్ నాయకులు, ఆర్టిజన్ నాయకులు , మరియు సంఘ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేసిన రాష్ట్ర సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్, జెన్కో కార్యదర్శి : చారుగుండ్ల రమేష్

భద్రాద్రి జిల్లా/ పాల్వంచ/ జనవరి.01/ అక్షరం న్యూస్బీకొత్త సంవత్సరంలో పాత సంగతులు, జ్ఞాపకాలు అన్నీ మరచిపోయి కొత్త ప్రారంభానికి శ్రీకారం చుడదామని.. అలాగే కొత్త సంవత్సరం మరింత మెరుగ్గా, ఆనందంగా, ఎన్నో ప్రసాదించే సంవత్సరం కావాలని ఆశిద్దామని, నూతన సంవత్సరం లో అన్ని దుఃఖాలు తొలగించి, ఆనందాన్ని , ఎన్నో ఆశలను మోసుకువస్తున్న కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ విద్యుత్ కాంతులు పంచె విద్యుత్ ఉద్యోగుల కు ,అధికారులకు ,రాష్ట్ర నాయకులకు తోటి సహచర మిత్రులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు రాష్ట్ర సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్, జెన్కో కార్యదర్శి చారుగుండ్ల రమేష్ తెలిపారు . సోమవారం 2024



## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు



కరీంనగర్, తిమ్మాపూర్ జనవరి 01 (అక్షరం న్యూస్)

మానకొండూర్ మండలం గంగిపల్లి గ్రామంలో పి.ఏ.సి.ఎస్ వైస్ చైర్మన్ పంజాల శ్రీనివాస్ గౌడ్ మాతృమూర్తి పంజాల శాంతమ్మ ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను గంగిపల్లి గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు పరామర్శించారు.

## ఘనంగా కార్పొరేటర్ వాలా రమణారావు జన్మదిన వేడుకలు



కరీంనగర్, తిమ్మాపూర్ జనవరి 01 (అక్షరం న్యూస్)

కరీంనగర్ 60 వ డివిజన్ కార్పొరేటర్ వాలా రమణారావు జన్మదినం సందర్భంగా మానకొండూరు మండలం గంగిపల్లి గ్రామపంచాయతీ పాలకవర్గం మరియు పాక్స్ డైరెక్టర్ వాలా అంజిత్ రావు ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు.అనంతరం వారు మాట్లాడుతూ తాను పుట్టిన పెరిగిన ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడపడం కోసం ఎంతగానో కృషి చేస్తున్న వాలా రమణారావు కు భగవంతుడు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని, ఆయన మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు..

## ఊరురా ఉత్సాహంగా... నూతన సంవత్సర వేడుకలు






**జనగామ జిల్లా/రఘునాథపల్లి/,( అక్షరం న్యూస్ ) జనవరి 1:**

కొత్త ఆశలు.. సరికొత్త నిర్ణయాలతో విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ మండలంలో నూతన సం వత్సర వేడుకలను అన్ని వర్గాలకు చెందిన వారు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. పాత సంత్సరం 2023కు వీడ్కోలు పలుకుతూ ఆదివారం అర్ధరాత్రి వరకు ప్రజలు విందులు, వినోదాలతో మునిగితేలారు. 2024కి స్వాగతం పలుకుతూ.. అర్ధరాత్రి 12 గంటలు దాటే వరకు నిరీక్షించిన తర్వాత యువకులు ఒక్కసారిగా ఆయా గ్రామాలలో జోరుగా....హుషారుగా కేరిం తలు కోడుతూ..టపాసులు పేల్చుతూ నూతన సంవత్సర వేడుకలను జరుపుకున్నారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయక లు కేకు కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేస్తూ నూతన సంవత్సర వేడుకలను ఉత్సహపూరిత వాతావరణంలో వైభవంగా నిర్వహించారు. మరి కొందరు కుటుంబ సభ్యుల మధ్య 2024 నూతన సంవత్సర కేకు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. యువకులు హ్యాపి న్యూ ఇయర్ అంటూ చిందులేసుకుంటూ...ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మహిళలు ఇళ్ల ముం గిట నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపే రంగురంగుల ముగ్గులు వేశారు మహిళలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. క్రైస్తవులు చర్చిలలో ప్రార్థనలు చేశారు.

# రామగుండం ఏరియా వన్‌లో ఉత్పత్తి ఆశాజనకం






**నూతన సంవత్సర వేడుకల కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన జీఎం చింతల శ్రీనివాస్.**

గోదావరిఖని ప్రతినిధి/పెద్దపల్లి/జనవరి 1/అక్షరం న్యూస్:

రామగుండం ఏరియా1 లోని భూగర్భ బొగ్గు గనులు ఓ సి పి 5 జీడీకే సీఎం ఉపరితల గనుల్లో డిసెంబర్ మాసంలో ఉత్పత్తి లక్ష్యం నాలుగు లక్షల 45 వేలకు గాను 385 వేల 465 ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించి 95% బొగ్గు ఉత్పత్తి ఆశాజనకంగా ఉందని ఆర్ జి వన్ జీఎం చింతల శ్రీనివాస్ అన్నారు. సోమవారం గోదావరిఖని ఆర్ సి ఓ ఏ క్లబ్ లో ఏర్పాటు చేసిన ప్రత్యేక విలేకరుల సమావేశంలో నూతన సంవత్సర శుభాకాంక్షలు వేడుకలు సింగరేణి ఉద్యోగులకు అధికారులకు పాత్రికేయులకు తెలుపుతూ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్ జి వన్ ఏరియాలో జీడికే వన్ అండ్ త్రీ ఎస్ డి ఎల్ ఉత్పత్తి లక్ష్యం 20,500 కు గాను 13973 ఉత్పత్తి సాధించి 68% నిలిచిందన్నారు. అదేవిధంగా జీడికే 2 2 ఏ ఇంక్లైన్ ఎస్ డి ఎల గనిలో 24 వేల ఉత్పత్తి లక్ష్యం కాగా 19418 ఉత్పత్తి సాధించి 81 శాతం నిలిచిందన్నారు జీడికే 11 ఇంక్లైన్ ఎల్ హెచ్ డి సీఎం సీఎం 2 లలో ఉత్పత్తి లక్ష్యం 75 వేలకు గాను 57, 690 ఉత్పత్తి లక్ష్యం సాధించి 77% నిలిచిందన్నారు. మొత్తం భూగర్భ గనులలో డిసెంబర్ మాసంలో ఉత్పత్తి లక్ష్యం రెండు లక్షల 85,000 కు గాను రెండు లక్షల 94386 ఉత్పత్తి లక్ష్యం సాధించి 103 శాతం నిలిచింది అన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుండి డిసెంబర్ నెల వరకు ఉత్పత్తి వారిగా చూస్తే మొత్తం భూగర్భ గనుల్లో ఉత్పత్తి లక్ష్యం 10 లక్షల 39,900 కుగాను 763,198 ఉత్పత్తి సాధించి 73% నిలిచింది అన్నారు అదేవిధంగా జీడీకే సీఎం ఓసీ ఐదు ఉత్పత్తి లక్ష్యం 22 లక్షల 5వేలకు గాను 22 లక్షల 75 వేల15 ఉత్పత్తి సాధించి 103 శాతం నిలిచింది అన్నారు. ఆర్ జి వన్ ఏరియాలోని భూగర్భ గనుల్లో ఓపెన్ కాస్ట్ లో ఉత్పత్తి లక్ష్యం 32 లక్షల 44900 కు గాను 30 లక్షల 38,313 ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించి 94% నిలిచిందన్నారు మరో మూడు నెలల్లో కాలంలో ఆర్థిక సంవత్సరం ఉత్పత్తి లక్ష్యాన్ని అధిగమిస్తామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు ఈ విలేకరుల సమావేశంలో డిప్యూటీ పర్సనల్ మేనేజర్ కిరణ్ కుమార్ డి వై జి ఎం లు మదన్మోహన్ అనిల్ కబాలి చంద్రశేఖర్ తదితరులు అధికారులు ఉద్యోగులు పాల్గొన్నారు.

# రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో నూతన సంవత్సర వేడుకలు





**రామగుండం కమీషనరేట్ ప్రజలకు,పోలీసు అధికారులకు సిబ్బందికి నూతన సంవత్సర శుభాకాంక్షలు.**

**నూతన లక్ష్యాలను నిర్దేశించుకుని పనిచేయాలి : రామగుండం పోలీస్ కమీషనర్ రెమా రాజేశ్వరి ఐపిఎస్.,**



గోదావరిఖని ప్రతినిధి/పెద్దపల్లి/జనవరి 1/అక్షరం న్యూస్:

నూతన సంవత్సరం 2024 సందర్భంగా రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సోమవారం అధికారులతో కలిసి కేక్ కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన రామగుండం పోలీస్ కమీషనర్ రెమా రాజేశ్వరి ఐపిఎస్., (డిఐజి).ఈ సందర్భంగా సీపీ మేడమ్ మాట్లాడుతూ గడిచిన సంవత్సరం పోలీసు శాఖలో ఎన్నో నూతన ఒడవడికలను,ఆధునాతన సాంకేతికతను అందించడమే కాకుండా సిబ్బంది పూర్తి స్థాయి విధి నిర్వహణ కు ఎంతో దోహదపడిందన్నారు.లా అండ్ ఆర్డర్ పోలీస్ అధికారులకు నిత్యం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలు చట్టపరిది లో పరిష్కారం చేస్తూ ప్రజలతో మంచి సంబంధాలు కలిగి ఉండే అవకాశం ఉంటుంది. బేసిక్ పోలీసింగ్ విధానాన్ని అవలంబిస్తూ ప్రజలకు మరింత చేరువ అవ్వాలని సూచించారు.ఈ నూతన సంవత్సరం లో కూడా అదే శైలిలో అధికారులు,సిబ్బంది వ్యక్తిగత, వృత్తిపరంగా నూతన లక్ష్యాలను నిర్దేశించుకుని పని చేయాలన్నారు తరచూ ఒత్తిడితో కూడిన పరిస్థితుల్లో చేసే పనితో పాటు ఆరోగ్యం విషయంలో కూడా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.గత సంవత్సరంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలు స్వేచ్ఛ,ప్రశాంతమైనవాతావరణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ఇన్సిడెంట్ ఫ్రీ ఎన్నికలు నిర్వహిండంలో కృషి చేసిన అదికారులను ప్రత్యేకంగా అభినందించి క్యాష్ రివార్డ్ లు అందజేశారు.అదేవిధంగా రాబోవు ఎలక్షన్లకు కూడా అధికారులు సిబ్బంది సన్నద్ధంగా ఉండాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో మంచిర్యాల డిసిపి సుధీర్ కేకెన్ ఐపీఎస్,ఏ ఆర్ అడిషనల్ డీసీపీ రియాజ్ హుల్ హాక్, ఏసీపీలు తులా శ్రీనివాసరావు,ఎడ్ల మహేష్,తిరుపతి రెడ్డి,సదయ్య,మోహన్,స్పెషల్ బ్రాంచ్ ఏసిపి మల్లారెడ్డి, ట్రాఫిక్ ఏసిపి నరసింహులు,వెంకటేశ్వర్లు,ఏ ఆర్ ఏ సి పి లు మల్లికార్జున్ సుందర్రావులు,పెద్దపెల్లి, మంచిర్యాల జోన్ పరిధిలోని సీఐ లు,ఎస్సైలు,సిసి మనోజ్ కుమార్,రామగుండం పోలీస్ కమిషనర్ రేట్ పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు బోర్లకుంట పోచ లింగం,సిబ్బంది పాల్గొన్నారు.





# దళితుల ఆత్మగౌరవ పోరాటమే భీమ్ కోరేగాం

- **కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్, మహంకాళి స్వామి,**
- **ఘనంగా భీమ్ కోరేగాం విజయ దివాస్.**

గోదావరిఖని ప్రతినిధి/పెద్దపల్లి/జనవరి 1/అక్షరం న్యూస్:
దశాబ్దాల తరబడి దళితులు సామాజికపరంగా ఎదుర్కొంటున్న వెలివేత కు వ్యతిరేకంగా చేసిన పోరాట ఫలితమే భీమ్ కోరేగాం విజయమని రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ మహంకాళి స్వామి అన్నారు.

ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం, తెలంగాణ అంబేద్కర్ భవన నిర్మాణ కమిటీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం గోదావరిఖని పట్టణంలోని రామగుండం మున్సిపల్ ఆఫీస్ ఎదుట గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం ముందు ఏర్పాటుచేసిన భీమ్ కోరేగాం విజయోత్సవ దినాన్ని ఘనంగా నిర్వహించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. అనంతరం రాష్ట్ర ఉపాధ్యక్షులు కాంపల్లి సతీష్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన మహంకాళి స్వామి కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. 204 సంవత్సరాల క్రితం, మహారాష్ట్రలోని పూణేకు సమీపాన భీమా నది ఒడ్డున అగ్రవర్ణ అహంకార పూరితులైన 28 వేల పిష్వ బ్రాహ్మణులకు, 500 మంది మహర్ వీరుల ఆత్మ గౌరవం కోసం చేసిన పోరాటం దళితుల ఆత్మగౌరవానికి పెద్ద విజయమన్నారు, 28,000 వేల మంది పీశ్వ సైనికులను 500 మంది మహర్ సైనికులు ఓడించి విజయం సాధించినారన్నారు. మహర్ సైనికులు చేసిన పోరాటం లో 22 మంది అమరులైనరన్నారు, భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ జీవించినంత కాలం ప్రతి జనవరి ఒకటో తేదీన భీమే కోరగాంలో విజయోత్సవ సభలు నిర్వహించే వారిని అమరులైన వారికి ఘన నివాళులర్పించే వాళ్లని అన్నారు, ఆత్మగౌరవం కోసం దళితులు మహర్ కోరేగాం వీరులను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. రాజకీయాలకు అతీతంగా, అంబేద్కర్ సంఘాలు దళిత, సంఘాలు పనిచేయాలన్నారు. ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కాంపెల్లి సతీష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్లు, కల్వల శిరీష సంజీవ్, దొంత శ్రీనివాస్, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం కేంద్ర కమిటీ సభ్యులు, వడ్డపల్లి శంకర్, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, సీనియర్ జర్నలిస్టు, బొంకూరి మధు, రాష్ట్ర ఉపాధ్యక్షులు, మైస రాజేష్ రాష్ట్ర కార్యదర్శి, మంతెన లింగయ్య, సింగరేణి ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్, కేంద్ర కమిటీ సీనియర్ ఉపాధ్యక్షులు, అడుకపురం చంద్రమౌళి, జిల్లా కో కన్వీనర్ దుబాసి బొందయ్య, పోగుల రంగయ్య, తెలంగాణ అంబేద్కర్ భవన నిర్మాణ కమిటీ చారిటబుల్ ట్రస్ట్ వైస్ చైర్మన్, శనిగరం రామస్వామి, గొర్రె నర్సింగరావు రాసపల్లి రవికుమార్, శనిగరపు హరీష్, పుల్లూరి మహేందర్, పేరుక రవి, కల్వల రాజేశం. కనుకుంట్ల సమ్మయ్య, జనగామ శంకర్, కుడితల శివ, దళిత సామాజిక హక్కుల పరిరక్షణ కమిటీ జిల్లా అధ్యక్షులు చిలుక ప్రసాద్, డాక్టర్ వాసపల్లి ఆనంద్ బాబు మారుతి, సాయి, తదితరులు పాల్గొన్నారు.









## దేవర నుంచి ఎన్టీఆర్ లుక్స్

**హైదరాబాద్,** జనవరి 1అక్షరం న్యూస్ :
ఎన్టీఆర్ హీరోగా, జాన్వీకపూర్ హీరోయిన్గా నటిస్తున్న 'దేవర'చిత్రం అప్డేట్ గురించి ప్రేక్షకులు, అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు. కొత్త సంవత్సరం వచ్చిన వేళ టీజర్, గ్లింప్ ఏదైనా వదులుతారేమో అని ఎదరుచూశారు. కానీ ఎన్టీఆర్ కొత్త లుక్తో కూడిన పోస్టర్ను విడుదల చేశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు చెబుతూ కొత్త పోస్టర్ను విడుదల చేశారు. దాంతో అభిమానులకు ఓ శుభవార్త కూడా చెప్పారు. ఈ నెల 8న పవర్ఫుల్ గ్లింప్స్ విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఎలక్ట్రిఫైయింగ్ దేవర ఈయర్' అంటూ ఎనిమిదో తేదిన సాలిడ్ గ్లింప్స్ రాబోతోంది అని ట్విట్టర్లో పేర్కొన్నారు. పడవ మీద రౌద్రంగా చూస్తూ నిల్చున ఎన్టీఆర్ లుక్ ఆకట్టుకుంటుంది. ప్రస్తుతం ఈ పోస్టర్ నెట్టింట వైరల్ అవుతోంది. ఎన్టీఆర్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో జాన్వీకపూర్ కథానాయికగా నటిస్తోంది. ఆమెకిది తెలుగులో తొలి చిత్రం. కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్నారు. ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధా ఆర్ట్స్ పతాకంపై సుధాకర్ మిక్కిలినేని, హరికృష్ణ కొసరాజు నిర్మిస్తున్నారు.



## న్యూ ఇయర్ విషెస్ చెప్పిన చిరంజీవి

**హైదరాబాద్,** జనవరి 1అక్షరం న్యూస్ :
గడిచిన సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ నూతన సంవత్సరానికి ఆహ్వానం పలుకుతున్నారు సినీ సెలబ్రిటీలు. నూతన ఉత్సాహంతో కొత్త సంవత్సరం సక్సెస్ఫుల్గా సాగాలని ఆకాంక్షిస్తున్నారు. ఈ మేరకు మెగాస్టార్ చిరంజీవి సినీ ప్రియులకు, అభిమానులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెబుతూ ఓ ట్వీట్ చేశారు. 'గడిచిన ఏడాది (2023) తెలుగు సినిమాకు, ఇండియన్ సినిమాకు చారిత్రాత్మక సంవత్సరంగా చెప్పుకోవచ్చు. తెలుగు చిత్ర పరిశ్రమ ఎన్నో రకాలుగా విజయాలు అందుకొంది. ఆస్కార్, గోల్డెన గ్లోబ్, జాతీయ పురస్కారాలు, ఎన్నో బ్లాక్బస్టర్ హిట్స్ ఇలా చెప్పుకుంటే ఎన్నో విజయాలు అందుకున్నాము. వైవిధ్యమైన కథా చిత్రాలతో సరిహద్దులను దాటాము. ఈ ఏడాది సాధించిన విజయాలు, పురస్కారాలతో తెలుగు సినిమా స్థాయి ప్రపంచపటంలో నిలిచిపోయింది. మన స్థాయి పెద్దది, మరిన్ని మంచి విషయాలను సాధించడానికి కలలు కనే ధైర్యం చేయవచ్చు. వాటిని సాకారం చేసుకోవడానికి ప్రయత్నించవచ్చు' అని చిరంజీవి ట్వీట్లో పేర్కొన్నారు. చిరంజీవి వశిష్ఠ దర్శకత్వంలో ఓ సోషియో ఫాంటసీ చిత్రంలో నటిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఈ చిత్రం ఉంది.

## గతేడాది నాకెంతో ప్రత్యేకం : అల్లు అర్జున్



**హైదరాబాద్,** జనవరి 1అక్షరం న్యూస్ :
ఐకాన్ స్టార్ అల్లు అర్జున్కు గడిచిన ఏడాది ఎంతో ప్రత్యేకం. 'పుష్ప' మాస్ మసాలా చిత్రంలో ఉత్తమ నటనకుగానూ ఉత్తమ నటుడిగా జాతీయ పురస్కారం అందుకున్నారు. తెలుగు సినిమా చరిత్రలో ఇప్పటి దాకా ఎవరూ సాధించలేని ఘనతను అల్లు అర్జున్ సాధించి చరిత్ర సృష్టించారు. ఈ మేరకు నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఆయన ఓ ట్వీట్ చేశారు. గత ఏడాది తాను ఎన్నో ముఖ్యమైన పాఠాలు నేర్చుకున్నానని పేర్కొన్నారు. అభిమానులు అందరికీ న్యూ ఇయర్ విషెస్ చెబుతూ.. 2023 అందించిన జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. 'పలు విధాలుగా 2023 నాకెంతో ప్రత్యేకం. గడిచిన ఏడాది నా ప్రయాణంలో భాగమైన ప్రతి ఒక్కరికీ థ్యాంక్స్. కృతజ్ఞతతో ఈ ఏడాదికి వీడ్కోలు పలుకుతున్నా' అని ట్వీట్లో పేర్కొన్నారు. ప్రస్తుతం.. 'పుష్ప 2'తో బిజీగా ఉన్నారు బన్నీ. ప్రేక్షకుల అంచనాలను
అందుకునేలా దర్శకుడు సుకుమార్ 'పుష్ప2'ను రూపొందిస్తున్నారు. జాతర నేపథ్యంలో వచ్చే సన్నివేశంలో అల్లు అర్జున్ గంగమ్మ తల్లిగా కనిపించడం సినిమాకే హైలైట్గా ఉంటుందని సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ అభిమానుల్లో ఆసక్తి రేకెత్తించారు. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ రామోజీ ఫిల్మ్సిటీలో జరుగుతోంది. ఈ ఏడాది ఆగస్టు 15న పుష్ప -2 విడుదల కానుంది.

## చిరంజీవి తాజా చిత్రం..

### రానా ఔట్..కునాల్ కపూర్ ఇన్




**హైదరాబాద్,** జనవరి 1అక్షరం న్యూస్ :
మెగాస్టార్ చిరంజీవి 'బింబిసార' సినిమా దర్శకుడు మల్లిడి వశిష్టతో ఒక ఫాంటసీ సినిమా చేస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ కూడా మొదలై, చాలా సన్నివేశాల చిత్రీకరణ కూడా జరుగుతోంది. అయితే ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభించే ముందు ఈ సినిమాలో రానా దగ్గుబాటి విలన్ గా చేస్తున్నారని ప్రచారం సాగింది. ఇప్పుడు తాజా సమాచారం ప్రకారం రానా దగ్గుబాటి ఈ సినిమా నుండి తప్పుకున్నారని తెలుస్తోంది.

ఎందుకంటే ఈ సినిమా ఫాంటసీ మూవీ అవటం, ఇందులో రానా వెయ్యబోయే పాత్ర అతను ముందు ముందు చెయ్యబోయే హిరణ్యకశిపుడి పాత్రతో పోలి ఉండటం అందుకు కారణం అని అంటున్నారు. ఈ రెండు పాత్రలు ఒకే విధంగా కనిపిస్తాయని రానా అనుకోవటంతో చిరంజీవి సినిమా నుండి రానా తప్పుకున్నారని పరిశ్రమలో ఒక టాక్ నడుస్తోంది. రానా తప్పుకోవడంతో చిత్ర నిర్వాహకులు వెంటనే అతనికి బదులు హిందీ నటుడు కునాల్ కపూర్ ని తీసుకున్నారని తెలిసింది. కునాల్ కపూర్ ఎక్కువ తెలుగు సినిమాలు చెయ్యలేదు, ఇంతకు ముందు నాగార్జున నాని లు నటించిన 'దేవదాస్' సినిమాలో ఒక పాత్ర చేసాడు. అంతే తరువాత ఇప్పుడు ఈ చిరంజీవి సినిమాలో నటిస్తున్నారు. రానా బదులుగా ఈ సినిమాలోకి వచ్చిన కునాల్ కపూర్ ఈ సినిమా కోసం షూటింగ్ కూడా మొదలెట్టేసాడు అని తెలుస్తోంది. కొన్ని రోజుల క్రితం అన్నపూర్ణ స్టూడియోలో ఈ సినిమా చిత్రీకరణలో కునాల్ కపూర్ పాల్గొన్నట్టుగా తెలుస్తోంది. ఇతను ఈ సినిమాలో విలన్ గా చేస్తున్నారు. ఈ సినిమాని యూవీ క్రియేషన్స్ నిర్మిస్తున్నారు, ఎంఎం కీరవాణి సంగీత దర్శకుడు.



## గీతాంజలి మళ్లీ వచ్చింది..లో అంజలి

**హైదరాబాద్,** జనవరి 1అక్షరం న్యూస్ :
అంజలి టైటిల్ పాత్రలో నటిస్తోన్న హారర్ కామెడీ మూవీ 'గీతాంజలి మళ్ళీ వచ్చింది'. మలయాళ నటుడు రాహుల్ మాధవ్ ఈ చిత్రంతో టాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్నారు. కోన వెంకట్ సమర్పణలో ఈ సీక్వెల్ను ఎంవీవీ
సినిమా, కోన ఫిల్మ్ కార్పొరేషన్ సంస్థలపై ఎంవీవీ సత్యనారాయణ, జీవీ నిర్మిస్తున్నారు. అంజలి నటిస్తోన్న 50వ సినిమా ఇది. హారర్ కామెడీ జోనర్ లో ట్రెండ్ సెట్ చేసిన గీతాంజలి సినిమాకు సీక్వెల్ ఇది. షూటింగ్ శరవేగంగా పూర్తవుతుంది. కొత్త ఏడాది 2024 ప్రారంభం సందర్భంగా నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలియజేస్తూ మేకర్స్ ఈ సినిమా నుంచి స్పెషల్ పోస్టర్ను విడుదల చేశారు. పాడుబడ్డ భవంతిలో నాట్య కళాకారిణి లుక్లో అంజలి కనిపిస్తోంది. ఓ వైపు అంజలి లుక్.. మరో వైపు భవంతి బ్యాక్ డ్రాప్ చూస్తుంటే సరికొత్త కథ, కథనంతో 'గీతాంజలి మళ్ళీ వచ్చింది' ఈ ఏడాది ప్రేక్షకులను మెప్పించటానికి సిద్ధమైందని తెలుస్తోంది. భారీ బడ్జెట్తో రూపొందుతోన్న 'గీతాంజలి మళ్ళీ వచ్చింది' చిత్రాన్ని మేకర్స్ తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో రిలీజ్ చేస్తున్నారు. 'గీతాంజలి' సినిమా ఎక్కడ ముగిసిందో అక్కడి నుంచే సీక్వెల్ స్టార్ట్ అవుతుంది. ఇంకా ఈ సినిమాలో శ్రీనివాస్ రెడ్డి, సత్యం రాజేష్, షకలక శంకర్లతో పాటు ఈ సీక్వెల్లో సత్య, సునీల్, రవిశంకర్, శ్రీకాంత్ అయ్యంగార్ ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటి వరకు వచ్చిన హారర్ కామెడీ చిత్రాలన్నీ ఒక ఎత్తైతే 'గీతాంజలి మళ్లీ వచ్చింది'లో హారర్ కామెడీ వాటన్నింటినీ మించేలా ఉంటుంది.

# నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్న పరకాల ఎమ్మెల్యే





**హనుమకొండ జిల్లా / పరకాల నియోజకవర్గం / ఆత్మకూరు మండలం / అక్షరం న్యూస్:** ఆత్మకూర్ మండల కేంద్రంలోని గ్రేమ్ జి.జే.యం. పెంతేకొస్తు ప్రార్థన మందిరంలో ఘనంగా నూతన సంవత్సర వేడుకలో పాల్గొన్న పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి, మాజీ పార్లమెంట్ సభ్యులు సిరిసిల్ల రాజయ్య. ఆత్మకూరు మండల కేంద్రంలోని జి. జే. యం. పెంతేకొస్తు ప్రార్థనా మందిరంలో జరిగిన నూతన సంవత్సర వేడుకలలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాజీ పార్లమెంట్ సభ్యులు సిరిసిల్ల రాజయ్య పాల్గొన్నారు.అనంతరము చిన్నపిల్లలు పాస్టర్స్ తో కలిసి వారు కేక్ కట్ చేశారు. నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు మార్పు కావాలని కోరుకొని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానికి అధికారం ఇచ్చారని పరకాల నియోజకవర్గంలో నాపై నమ్మకంతో నన్ను శాసనసభ్యులుగా గెలిపించారని అన్నారు. మీ నమ్మకాన్ని వమ్ము చేయకుండా అన్ని వర్గాల ప్రజలందరికీ అండగా ఉంటానని హామీ ఇచ్చాడు.ప్రజల భాగస్వామ్యం ప్రభుత్వ సహకారంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్రములో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం లోని రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా పాలన చేస్తుందని మీ అందరి ఆశీస్సులు ఈ ప్రభుత్వానికి మెండుగా ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# మానసిక దివ్యాంగులతో 2024 స్వాగత సంబరాలు- డాక్టర్ అనితా రెడ్డి

**హన్మకొండ జిల్లా /సర్కిట్ హౌజ్ /అక్షరం న్యూస్ :** అనురాగ్ హెల్పింగ్ సొసైటీ ప్రెసిడెంట్ డాక్టర్ అనితా రెడ్డి అధ్యక్షతన హన్మకొండ లోని స్పందన మానసిక దివ్యాంగుల ఆశ్రయం లో నిర్వహించిన 2024 స్వాగతం కార్యక్రమం లో డాక్టర్ అనితా,పిల్లల మధ్య ఆనందం గా కేక్ ను కట్ చేసి సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ రాబోయే కొత్త సంవత్సరం లో అందరూ అనుకున్నవన్నీ జరిగి ప్రతి రోజూ సంతోషంగా గడపాలని , కల్మషము ఎరుగని ఈ పిల్లల జీవితం ఆనందంగా సాగాలని ఆకాంక్షిచారు, నూతన సంవత్సర వేడుకలు ఈ పిల్లల మధ్య జరుపుకోవడం సంతోషంగా ఉందని, పది మందిని సంతోష పెట్టి నప్పుడే మనస్సుకు తృప్తి అని అన్నారు, పిల్లలు పాటలు పాడి డాన్సులు చేసి అలరించారు, తన సహకారం సంస్థ కు ఎప్పడికి ఉంటుందని ,అందరిని గౌరవిద్దాం, అందరిని ప్రేమిద్దాం, మంచిని, ప్రపంచశాంతిని కోరుకుందాం! అని డాక్టర్ అనితా రెడ్డి అన్నారు, అనంతరం పండ్లు, స్వీట్లు అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు, ఈ కార్యక్రమంలో డాక్టర్ అనితా రెడ్డి, సుచరిత, వసుధ, తదితరులు పాల్గొన్నారు



# నూతన సంవత్సర వేడుకలలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మాస్టర్ షేక్షావలి ఆచారి

**గద్వాల్ జిల్లా/అయిజ మండలం/జనవరి01/అక్షరం న్యూస్:** మండల పరిధిలోదఅయిజ మున్సిపాలిటీ కేంద్రంలో మండల పార్టీ ఆఫీస్ నందు మరియు పట్టణ ఆఫీస్ నందు నూతన సంవత్సర వేడుకలు కేక్ కట్ చేసి జరుపుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు అనంతరం సోమవారం చౌరస్తా మండల పార్టీ ఆఫీస్ నందు మండల పార్టీ అధ్యక్షుడు ఉత్తనూరు జయన్న ఆధ్వర్యంలో మరియు వివిధ గ్రామాల నుంచి వచ్చిన కార్యకర్తలతో కలిసి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మాస్టర్ షేక్షావలి ఆచారి నూతన సంవత్సర సందర్భంగా కేక్ కట్ చేసి నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవడం జరిగింది. అదేవిధంగా పట్టణ కేంద్రంలోని పాత బస్టాండ్ నందు కేక్ కట్ చేసి నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో జోగులాంబ గద్వాల జిల్లా లీగల్సేల్ అధ్యక్షుడు సురేష్ గౌడ్ జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షులు పాండురంగ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివుడు హనుమన్న మీసేవ హనుమన్న ఉలిగాన్న రాజు మండల ఉపాధ్యక్షులు జానుద్దీన్ దేవకొండ లక్ష్మన్న సత్యానందం అబ్రహం ఉప్పల క్యాంపు మహేష్ పట్టణ ఉపాధ్యక్షుడు కృష్ణారెడ్డి పట్టణ మైనారిటీ సెల్ అధ్యక్షుడు శాలి ఫైల్ మాన్ పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ముక్కెరన్న భీమేష్ ఆంజనేయులు గౌడు మహేంద్ర భాస్కర్ వెంకటేష్ తెలుగు బీసన్న తెలుగు రాముడు తెలుగు చిన్న కృష్ణ పెద్ద కృష్ణ తెలుగు భీమన్న తెలుగు తాయప్ప నరసింహులు ఈరన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# వారికే నామినేటెడ్ పదవులు.. ఆ ప్రాంతాల మీదుగా ఎయిర్‌పోర్ట్‌కి మెట్రో..

- సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు..





**జనవరి01/అక్షరం న్యూస్:** మెట్రో కానీ, ఫార్మాసిటీని కానీ రద్దు చెయ్యడం లేదు.. ప్రజాప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని వాటిని స్ట్రీమ్‌లైన్ చేస్తున్నాం.. అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. మియాపూర్ నుంచి ఆర్సీపురం వరకూ మెట్రోను విస్తరించడంతోపాటు.. గతంలో ప్రతిపాదించినట్లుగా రాయదుర్గం నుంచి కాకుండా పాతబస్తీ మీదుగా ఎయిర్‌పోర్ట్‌కి మెట్రోను తీసుకెళ్తామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని స్ట్రీమ్ లైన్ చేస్తున్నామని, ఎయిర్పోర్టుకి ముందు ప్రభుత్వం ప్రతిపాదించిన రూట్లతో పోలిస్తే దూరం తగ్గిస్తామన్నారు. %దీఎజూ% నుంచి ఎయిర్పోర్ట్ వరకు 32 కిలోమీటర్లు వస్తుంది.. ఎంజిబిఎస్ నుంచి పాతబస్తీ మీదుగా శంషాబాద్ ఎయిర్పోర్టు వరకు మెట్రో ఉంటుందన్నారు. నాగోల్ నుంచి ఎల్బీనగర్, ఓఎస్ హాస్పిటల్ మీదుగా చాంద్రాయణ గుట్ట వద్ద ఎయిర్పోర్టుకి వెళ్లే మెట్రో లైన్ కి లింక్ చేస్తామన్నారు. మియాపూర్ నుంచి అవసరమైతే రామచంద్రపురం వరకు మెట్రో పొడిగిస్తామంటూ రేవంత్ పేర్కొన్నారు.

అవసరమైతే మైండ్ స్పేస్ వరకు ఉన్న మెట్రోని ఫైనాన్సిల్ డిస్ట్రిక్ట్ వరకు పొడిగిస్తామన్నారు. గచ్చిబౌలి ఏరియా నుంచి ఎయిర్పోర్టుకి మెట్రో వెళ్లేవారు దాదాపు ఉండరన్నారు. తాము కొత్తగా ప్రతిపాదిస్తున్న మెట్రో లైన్స్ ముందు ప్రభుత్వం ప్రతిపాదించిన మొత్తం కంటే తక్కువ అవుతుందన్నారు. ఫార్మాసిటీని అంచలంచలుగా రింగ్ రోడ్ రీజినల్ రింగ్ రోడ్ మధ్య ప్రత్యేకంగా క్లస్టర్లను ఏర్పాటు చేస్తామన్నారు. జీరో కాలుష్యంతో ఈ క్లస్టర్లు ఏర్పాటు చేస్తామన్నారు. అక్కడి పరిశ్రమల్లో పనిచేసే వాళ్ళకి గృహనిర్మాణం కూడా ఉంటుందన్నారు. అక్కడి వాళు ళ్ళ ఎవ్వరు కూడా హైదరాబాద్ వరకు రాకుండా అన్ని ఏర్పాట్లు ఉండేట్లు క్లస్టర్లు ఉంటాయన్నారు. గతంలోని సీఎం క్యాంపు కార్యాలయాన్ని స్టేట్ గెస్ట్ హౌస్ గా మారుస్తామంటూ సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. యువతకు అవసరమైన స్కిల్స్ పెంచేందుకు ప్రత్యేక విశ్వవిద్యాలయాలు ఏర్పాటు చేస్తామన్నారు. అంతర్జాతీయ స్థాయిలో ప్రమాణాలు కలిగిన. ప్రముఖ పేరున్న పారిశ్రామిక వేత్తల ద్వారా ఈ స్కిల్స్ పై శిక్షణ ఉంటుందన్నారు. సాధారణ డిగ్రీలకు ఉండే అర్హతలన్నీ ఉంటాయని.. స్కిల్స్ అదనంగా ఉంటాయని వివరించారు. అక్కడ నుంచి బయటకి వెళ్ళేవాళ్ళకి క్యాంపస్ లోనే ఎంపిక ఉంటుందన్నారు. ఇప్పటికే అధికారాన్ని వికేంద్రీకరించామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. మంత్రులను ఉమ్మడి జిల్లాలకు ఇంచార్జిలుగా బాధ్యతలు అప్పగించామన్నారు. 100 బెడ్స్ ఆస్పత్రి ఉన్న చోట నర్సింగ్ కళాశాల ఉంటుందన్నారు. విదేశాలకు వెళ్లే యువతకు ఓరియంటేషన్ ఇప్పిస్తామన్నారు. ఆయా దేశాలకు అవసరమైన మాన్ పవర్ ను ప్రభుత్వం ద్వారా అందిస్తామన్నారు. ఇందువల్ల యువతకు ఉపాధి అవకాశాలు మెరుగు పరుస్తామన్నారు. మన దగ్గర పెద్ద సంఖ్యలో యువత ఉందని.. వారికి ఆసక్తి కలిగిన విభాగాల్లో శిక్షణ ఇప్పిస్తామన్నారు. చాలా మంది సీనియర్ అధికారులు ప్రావీణ్యం కలిగిన వారికి శిక్షణ ఇప్పించే అవకాశం ఉందన్నారు. 3వ తేదీన పీసీసీ విస్తృతస్థాయి సమావేశం ఉందని.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పదవులు ఇస్తామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. పార్టీ కోసం పనిచేసిన వారితో నామినేటెడ్ పదవులు భర్తీ చేస్తామన్నారు. తనకు దగ్గరనో.. లేదా భందువులనో పదవులు ఇచ్చేది ఉండదన్నారు. తాను ఏది చేసినా విస్తృతస్థాయి ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పదవులు భర్తీ చేస్తామన్నారు. పార్టీ కోసం పని చేసిన వారికి పదవులు ఇస్తామని.. ప్రెస్ అకాడమీ చైర్మన్ భర్తీ చేసిన తర్వాత జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. హైదరాబాద్ కమిషనరేట్ల కమిషనర్లను నియమించామని.. వారికి అవసరమైన మాన్ పవర్ ను వాళ్ళే పిక్ చేసుకుంటారన్నారు.

శాఖలకు ప్రతిభ కలిగిన అధిపతులను నియమించడం వరకు తాను చూస్తానన్నారు. వాళ్ళ పరిధిలో అవసరమైన అధికార్లను నియమించుకుని యంత్రాంగం సక్రమంగా పనిచేసేట్లు చూసుకోవాలన్నారు. అధికారుల నియామకాల్లో సామాజిక న్యాయం కూడా జరిగేట్లు చూస్తామని సీఎం పేర్కొన్నారు. సంస్కరణలు తీసుకొచ్చి స్ట్రీమ్ లైన్ చేసే పనిలో ఉన్నానని.. తన వద్ద చెప్పేది ఒకటి చేసేది ఒకటి ఉండదన్నారు. జర్నలిస్టులకు సంబంధించిన సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరిస్తాని.. ఇప్పటి నుంచి వంద రోజుల్లో పరిష్కారమయ్యేలా కృషి చేస్తానన్నారు.

## పాత సంవత్సరానికి బాయ్ బాయ్ కొత్త సంవత్సరానికి హాయ్ హాయ్



**రంగారెడ్డి / రాజేంద్రనగర్ / గండిపేట్ / జనవరి 01/ అక్షరం న్యూస్ :** నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ఖానాపూర్ బాప్టిస్ట్ చర్చిలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా కేక్ కట్ చేసి ఒకరికి ఒకరు కేక్‌ను తినిపించుకున్నారు. పాత సంవత్సరానికి గుడ్ బాయ్ చేబుతూ కొత్త సంత్సరానికి స్వాగతం పలికారు. 2024 సంవత్సరంలో యేసు ప్రభువు ఆశీర్వాదాలతో ప్రజలంతో సుఖసంతోషాలతో ఉండేలా చూడాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు రామేశ్వరం నర్సింహ్మా, ఉపాధ్యక్షులు పెద్దపులి శంకర్, కార్యదర్శి కిషన్, కోశాధికారి రామేశ్వరం దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

## నూతన సంవత్సరంలో ప్రజలు సంతోషంగా ఉండాలి

- కార్పొరేటర్ పద్మావతి పాపయ్య యాదవ్



**రంగారెడ్డి / రాజేంద్రనగర్ / గండిపేట్ / జనవరి 01/ అక్షరం న్యూస్ :** బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నూతన సంవత్సరంలో ప్రజలు ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని 7 వ వార్డ్ కార్పొరేటర్ పద్మావతి పాపయ్య యాదవ్ అన్నారు. సోమవారం కార్పోరేషన్ పరిధిలోని నర్సా రెడ్డి, డాక్టర్స్ కాలనీల నుంచి కాలనీ ప్రెసిడెంట్లు, కమిటీ సభ్యులు, కాలనీ వాసులు కార్పొరేటర్ పద్మావతి పాపయ్య యాదవ్ ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## శబరిమలకు తరలిన స్వాములు



**రంగారెడ్డి / రాజేంద్రనగర్ / గండిపేట్ / జనవరి 01/ అక్షరం న్యూస్ :** గంధం గూడ శ్రీ జ్ఞాన వెంకటేశ్వర స్వామి దేవాలయంలో అయ్యప్ప స్వాములు 41 రోజు దీక్ష చేసి 40 మంది స్వాములు శబరి యాత్రకు బయలుదేరారు. ఆలయంలో ఇరుముడులు కట్టుకొని స్వామి శరణం అయ్యప్ప శరణం అంటూ శరణు ఘోషతో బయలుదేరారు. అయ్యప్ప స్వాములకు జ్ఞాన వెంకటేశ్వర స్వామి కమిటీ సభ్యులు శాలువాతో సన్మానం చేసి పంపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు రామచంద్రయ్య, ఉపాధ్యక్షుడు తలారి ప్రేమ్ కుమార్, నరేందర్ గురుస్వామి, సుధాకర్ గురుస్వామి, తలారి రమేష్, నవీన్ గురుస్వామి, రాజశేఖర్ ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన సంవత్సరంలో ప్రజలు సంతోషంగా ఉండాలి

- ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డి



**రంగారెడ్డి / రాజేంద్రనగర్ / గండిపేట్ / జనవరి 01/ అక్షరం న్యూస్ :** నూతన సంవత్సరం సందర్భంగా మణికొండ మున్సిపాలిటీ పరిధిలో అల్కాపూర్ టౌన్‌షిప్ లోని రామాలయంలో ప్రత్యేక పూజలో మణికొండ ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నూతన సంవత్సరంలో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. స్వామి వారికీ ముక్కలు చెల్లించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించరు. ఈ కార్యక్రమంలో మణికొండ బీ ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు శ్రీరాములు, రాజేంద్రనగర్ బీ ఆర్ ఎస్వి ఇంచార్జి శ్రావణ్, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## హన్విత్ రెడ్డికి మంత్రి పొంగులేటి దంపతుల ఆశీస్సులు.

**ఖమ్మం జిల్లా /ఖమ్మం రూరల్ / జనవరి 1/ అక్షర న్యూస్ :** మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి మనుమడు హన్విత్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు నగరంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో సోమవారం జరిగాయి. ఈ వేడుకలకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాధురి దంపతులు, కాంగ్రెస్ జిల్లా నాయకులు పొంగులేటి ప్రసాద్ రెడ్డి , శ్రీ లక్ష్మి దంపతులు హాజరయ్యారు. నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలతో చల్లగా ఉండాలని చిన్నారిని ఆశీర్వదించారు.



